J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 14 08.9.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




# ఇండియా ఇక భారత్

## పేరులో ఏముంది..? అనుకుంటే పొరపాటే... అంతా పేరులోనే ఉంది!

ఇండియా ఇక భారత్ కాబోతోంది...! అదేంటి ఇప్పుడు మనది భారత దేశమే కదా...! అనుకుంటున్నారా. అవును ..... మనది భారత దేశమే. ఇక ముందుకూడా భారత దేశమే. కానీ, ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా మనల్ని ఇండియన్స్ అంటారు. మనం కూడా మీది ఏ దేశం అంటే ఠక్కున ఇండియా అని చెప్తాం. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇండియా పేరును భారత్ అని మార్చబోతోందన్న వార్త ఒక్కసారిగా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. జి :20 సదస్సుకి వస్తున్న అతిథులను రాష్ట్రపతి భవన్‌కి విందుకి ఆహ్వానిస్తూ భారత దేశ అధ్యక్షురాలు, మన దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపతి ముర్ము పంపిన లేఖలో 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ ఇన్వైట్స్ యు' అంటూ రాష్ట్రపతి కార్యాలయం ముద్రించడం ఆ వార్తలకి మరింత బలం చేకూర్చింది. అంతే కాకుండా ఆ సదస్సులో పాల్గొనబోయే ప్రపంచస్థాయి దిగ్గజాలకి, ప్రతినిధులకు మన దేశం తరపున ఇవ్వబోయే సమాచార పుస్తకాలలో మొత్తం భారత్ అనే ముద్రించారని వార్తలు వస్తున్నాయి.

ఇండియా అన్న పేరు మనది కాదని, ఇది ఆంగ్లేయులు పెట్టిన పేరని అనేక సందర్భాలలో చాలామంది మేధావులు మాట్లాడి వున్నారు. ఇండియా అన్న పేరుకి అర్థం కూడా లేదన్నది వారి వాదన. అయితే, భారత రాజ్యాంగంలో మన దేశాన్ని ఇండియా / భారత్ అని పొందుపరచివున్నారు. కాబట్టి ఇప్పుడు ఇండియాని పక్కన పెట్టి కేవలం భారత్ అని మాత్రమే పిలవడానికి రాజ్యాంగ పరంగా ఎలాంటి ప్రతిపాదనలు, తీర్మానాలు, బిల్లులు అవసరం లేదని ప్రధాన మంత్రి కార్యాలయం ఇప్పటికే క్లారిటీ ఇచ్చింది. అయితే, ఏవైనా అనుమానాలు వున్నవారికి ఇంకా స్పష్టత ఇవ్వడం కోసం రేపటి పార్లమెంటులో ఈ తీర్మానాన్ని పెట్టినా మనం ఆశ్చర్యపోనవసరం లేదు.

### రాత్రికి రాత్రి తీసుకున్న నిర్ణయం కాదు!

తమ కూటమి పేరు ఇండియా కాబట్టి వున్నట్లుండి దేశానికి ఇండియా పేరుని తీసేసి కేవలం భారత్ అనే పిలవాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రతిపక్ష

10 లో












# కసుమూరు దర్గాలో ప్రసన్న ప్రార్థనలు

జిల్లాలోని ప్రసిద్ధమైన వెంకటాచలం మండలం కసుమూరులో వెలసివున్న పవిత్రమైన కసుమూరు దర్గా (మస్తానయ్యస్వామి దర్గా)ను ఈనెల 3న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా ముజావర్లు ప్రసన్న పేరుతో ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. డీసీఎంఎస్ ఛైర్మన్ వీరి చలపతిరావు, డీఏపిబి ఛైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, రజిత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

# కాకుటూరులో కామన్ ఫెసిలిటీ సెంటర్




నెల్లూరులోని వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఇ పథకం కింద వెంకటాచలం మండలం కాకుటూరు గ్రామంలో 8.27 కోట్ల రూపాయలతో కామన్ ఫెసిలిటీ సెంటర్, వివెల్ షాపింగ్ మాల్ (గార్మెంట్స్ తయారీ యూనిట్)ల నిర్మాణాలు జరగనున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వీటి ఏర్పాటు జరుగుతోంది. ఈనెల 3న రాష్ట్ర వ్యవసాయమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. వీటి వల్ల ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందడంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. అందులోనూ ఈ ప్రాంతం కృష్ణపట్నం పోర్టుకు దగ్గరలో వున్నందున కామన్ ఫెసిలిటీ సెంటర్ ద్వారా ఉత్పత్తి అయ్యే వస్త్రాలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే అవకాశం కూడా ఉంది. భూమిపూజలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు వసంత లక్ష్మి- డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు రాక.. 'అయ్యో'ర్ల ఇబ్బందులు

గత మూడు నెలలుగా జీతాలు అందక ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, కుటుంబాల పోషణ కష్టంగా మారిందని పిఆర్‌టీయు జిల్లా శాఖ అధ్యక్షుడు డి.వెంకటరాజు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే అయ్యోర్లకు జీతాలు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## విడవలూరు కాలేజీలో

# సరస్వతి విగ్రహం



మండల కేంద్రమైన విడవలూరు వి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల భక్తాని శ్రీనివాసులు అనే పూర్వ విద్యార్థి తన సొంతనిధులతో సరస్వతిదేవి అమ్మవారి విగ్రహాన్ని అత్యద్భుతంగా రూపుదిద్దించి తాను చదువుకున్న ఆ కళాశాలలో ప్రతిష్టింపజేశారు. అందుకు సహకరించిన ప్రిన్సిపాల్‌కు, అధ్యాపకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. చదువుల తల్లి అనుగ్రహంతో విద్యార్థులు బాగా చదువుకోవాలని ఉత్తమ శ్రేణిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

## పాతికేళ్ళ తర్వాత మళ్ళీ..

# బడి చదువుల జ్ఞాపకాలు



పాతికేళ్ళ తర్వాత మళ్ళీ ఆ విద్యార్థులంతా కలిసి తమ బడిచదువులను జ్ఞాపకం తెచ్చుకుని ఆనందించారు. ఇందుకూరుపేటలోని ఎంకెఆర్ హైస్కూల్‌లో 1998–99 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు ఈనెల 3న ఆ పాఠశాలలో కలుసుకుని తమ ఆత్మీయ స్నేహాలను గుర్తుకుతెచ్చుకుని సంతోషంగా గడిపారు. ఎవరెవరు ఇప్పుడెక్కడ ఉంటున్నారో, ఏ ఉద్యోగాలు చేస్తున్నారో, జీవితాల్లో ఎలా స్థిరపడ్డారో ఒకరికొకరు ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబాల యోగక్షేమాలు తెలుసుకున్నారు. పిల్లలు ఎలా ఉన్నారు, ఏం చేస్తున్నారంటూ వారి ఆత్మీయ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన అయ్యవార్లను ఆహ్వానించి కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఘనంగా సన్మానాలు చేసి, ఆ గురువుల ఆశీస్సులందుకున్నారు.

# నెల్లూరులో.. 'ఛాంబర్ ఆఫ్ కామర్స్' శాఖ

## • ప్రారంభోత్సవం గావించిన విపిఆర్




ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఈనెల 5న నెల్లూరులో తన శాఖను ఏర్పాటుచేసింది. స్థానిక మినర్వా గ్రాండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభసభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (విపిఆర్) ముఖ్యఅతిథిగా పాల్గొని ఆ శాఖకు ప్రారంభోత్సవం గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీసీ సంస్థకు 95 ఏళ్ళ చరిత్ర ఉందని, కేవలం 35మంది సభ్యులతో ప్రారంభమైన ఈ సంస్థలో ఇప్పుడు 1350 మంది సభ్యులు ఉండటం గొప్ప విషయమన్నారు. దీనిద్వారా నెల్లూరు, ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమలోని అన్ని జిల్లాలకు సేవలు అందుతాయని, ఏసీసీ సేవల విస్తరణలో ఏసీసీ ప్రెసిడెంట్ ఇందిరాదత్ కృషి చాలా ఉందని ప్రశంసించారు. తొలుత, ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్(ఏసీసీ) ప్రెసిడెంట్ శ్రీమతి డా.వి.ఎల్.ఇందిరాదత్, నెల్లూరు ఛాప్టర్ ఛైర్మన్ రంగయ్యనాయుడు తదితరులు విపిఆర్‌కు ఘనస్వాగతం పలికారు. నేషనల్ ట్యాక్స్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ కృష్ణమోహన్, ఏసీసీ సభ్యులు ఎస్‌వీ రమేష్, బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# విఎస్‌యులో 'న్యాక్ బృందం'

## • నిర్వహణ బాగుందంటూ సంతృప్తి




నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు)ను 'న్యాక్' (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) బృందం ఇటీవల సందర్శించింది. మూడురోజుల పాటు వారు ఇక్కడ ఉండి కాకుటూరులోని వర్సిటీ క్యాంపస్‌ను, కావలిలోని వర్సిటీ కళాశాలను 'న్యాక్' సభ్యులు పరిశీలించారు. వర్సిటీలోని ఆక్వా పాండ్, హాస్టళ్లు, ఉద్యానవనాలు, క్యాంటీన్‌ల నిర్వహణ చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో న్యాక్‌లో మంచి గ్రేడ్ వచ్చేందుకు యూనివర్శిటీ అడుగులు వేస్తోందని విఎస్‌యు వర్గాలు భావిస్తున్నాయి. అనంతరం, ఇటీవల పిహెచ్‌డి పూర్తి చేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి న్యాక్ సభ్యుల సమక్షంలో విఎస్‌యు వైస్‌చాన్సలర్ ఆచార్య జి.ఎం.సుందరవల్లి పిహెచ్‌డి పట్టాను ప్రదానం చేశారు. ఆ తర్వాత జరిగిన న్యాక్ బృందం వీడ్కోలు కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి పాల్గొని మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విశ్వవిద్యాలయాల్లో భారీగా టీచింగ్ రిక్రూట్‌మెంట్ చేస్తోందని, త్వరలో బోధనా సిబ్బంది కొరత కూడా పూర్తిగా తగ్గి వర్సిటీలు మరింత ప్రగతిమార్గంలో పయనించే వీలుందని చెప్పారు. న్యాక్ బృందం ఛైర్మన్, మైసూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య హేమంతకుమార్, న్యాక్ సభ్యులు బుందేల్ ఖండ్ యూనివర్సిటీ డీన్ ఆచార్యదేవేష్ నిగం, అస్సాం యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య అనింద్య శ్యామ్ చౌదరి, యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ చెపాక్ క్యాంపస్ రిజిస్ట్రార్ ఆచార్య ఏలుమలై, గ్లోబల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఆచార్య పరాగ్ శరఫ్, విఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య పి. రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ జి.విజయానందకుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కోదండరామస్వామి సన్నిధిలో గోపూజ

మండల కేంద్రమైన బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం సన్నిధిలో ఈనెల 3న గోపూజ జరిగింది. బాలాలయం ప్రతిష్టా మహోత్సవాల సందర్భంగా ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# అంధులకు వెలుగునిచ్చే నేత్రదానం

## క్షేత్రప్రచారశాఖాధికారి పరవస్తు నాగసాయి సూరి



అంధత్వంలో కొట్టుమిట్టాడుతున్న ఎందరో అంధులకు వెలుగునిచ్చేదే నేత్రదానమని, ప్రతి ఒక్కరూ నేత్రదానం ఆవశ్యకతను గుర్తించి నేత్రదానంతో అంధులకు కంటిచూపునిచ్చి, వారి జీవితాల్లో వెలుగులు ప్రసరింపజేయాలని క్షేత్ర ప్రచారశాఖ అధికారి పరవస్తు నాగసాయి సూరి పిలుపునిచ్చారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పి.యం.పి) సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులో నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అందమైన ప్రపంచాన్ని మనకు పరిచయం చేసే అవయవం నేత్రమని, అందుకనే సర్వేంద్రియాణాం నయనం ప్రధానమని మన పెద్దలు పేర్కొన్నారని అంటూ, ఎంతోమంది పుట్టకతోనే అంధత్వం బారిన పడుతుంటే, మరి కొందరు ప్రమాదాల కారణంగా కంటిచూపు కోల్పోతున్నారని. అలాంటి వారికి నేత్రదానం చేసి ఆదుకోవాలని చెప్పారు. ప్రతిఏటా ఆగస్టు 25వ తేదీ నుండి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు జరుగుతుంటాయని, నేత్రదానం పట్ల అందరూ అవగాహనతో ఉండాలని తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డా.శార్వాణి , పి.యం.పి గౌరవాధ్యక్షులు ఎ.జయప్రకాశ్, నేత్రదానం మోటివేటర్ బాలాజీ, శేషు స్కూల్ కరస్పాండెంట్ బి. ఆదిశేషు, హెల్త్ కో-ఆర్డినేటర్ కె.వెంకటేశ్వర్లు, పి.ఎం.పి నాయకులు శాఖవరపు వేణుగోపాల్, జి.శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుబిడ్డ డాక్టరేట్ సాధించాడు



సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన వెంకటనారాయణ డాక్టరేట్ సాధించి ఉపాధ్యాయులందరికీ స్ఫూర్తిగా నిలిచాడు. చిన్నతనం నుంచి కష్టపడి చదువుకుని విద్యలో బాగా రాణిస్తూ ప్రస్తుతం సీతారామపురం ఆదర్శ పాఠశాలలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ టీచర్‌గా పనిచేస్తున్న వెండి వెంకటనారాయణ ఇటీవల 'ఎమోషనల్ మెచ్యూరిటీ అండ్ లెవల్స్ ఆఫ్ ఫ్రస్ట్రేషన్ ఆఫ్ ఇంటర్మీడియట్ స్టూడెంట్ ఎనాలిసిస్' అనే అంశంపై చేసిన పరిశోధనలకు మెచ్చి నాగార్జున యూనివర్సిటీ వారు పిహెచ్‌డి పట్టా ప్రదానం చేశారు. దీంతో సహచరులు, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు ఆయన్ను అభినందిస్తూ శుభాకాంక్షలు చెప్పారు.

○ హింసాంధ్ర....

## మొన్న పుంగనూరు.. నిన్న తాడేరు!

# నిఘా వ్యవస్థ నిద్రపోతోందా?

అటు చంద్రబాబు, ఇటు లోకేష్ సభలు వివాదాస్పదమవుతున్నాయి. బాబు చిత్తూరు పర్యటనలో భాగంగా అంగళ్ళ కూడలిలో మొన్న జరిగిన అల్లర్లు హింస ఇంకా మనం మర్చిపోలేదు. ఇంతలోనే మళ్ళీ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని తాడేరులో మరో వివాదం చేలరేగి హింసాత్మకంగా మారింది. రెండుచోట్లా కూడా ఇరు పార్టీలది ఒకటే స్క్రీన్‌ప్లే, ఒకటే పథకం, ఒకటే విధానం. వాళ్ళు వాళ్ళు కొట్టుకుని మధ్యలో పోలీసు వారిని గాయపరచడం వారి లక్ష్యంగా కనిపిస్తుంది. రెండు సంఘటనలూ జరిగిన తరువాత హింసకు మీరంటే మీరు కారణం అంటూ ఒకరిపై ఒకరు రెండు పార్టీలూ దుమ్మెత్తి పోసుకోవడం గమనిస్తుంటే, ఇదంతా కుట్ర పూరితంగా జరుగుతోందని భావించక తప్పడంలేదు.

కర్రలు, కత్తులు, రాళ్ళు, పెట్రోల్ బాటిళ్లు సమకూర్చుకుని రౌడీ మూకలు హింసకు సిద్ధమవుతుంటే నిఘా వ్యవస్థ నిద్రపోతోందా...? అన్న అనుమానం కలుగుతోంది. ఇలాంటి చిల్లర సంఘటనలు కూడా ముందుగా గుర్తించలేని నిఘావ్యవస్థ భవిష్యత్తులో ముఖ్యమంత్రి లాంటి వీవీవీఐపిలకి ఏం రక్షణ కల్పిస్తుందన్న సందేహం సామాన్యుల నుండి వ్యక్తమవుతోంది.

ఇలాంటివన్నీ చిన్న సంఘటనలు. కొంత మంది చిల్లర సమూహం కలిసి చేసే దుర్మార్గాలు. ఇలాంటి వాటిని నిఘావర్గాలు పసికట్టాలి. తప్పు ఎవరిదైనా, ఆ సంఘటనల వల్ల ఏ పార్టీ లబ్దిపొందినా మధ్యలో నష్ట పోతున్నది ప్రజలు, వాళ్ళు తగలపెడుతున్నవి ప్రజల ఆస్తులు. తీవ్రంగా దెబ్బలు తింటోంది పోలీసులు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా నిఘా వర్గాలు గమనించుకోవాలి. ఇలా ప్రతీ సారి పోలీసులు గాయాలు పాలవుతుంటే, వీళ్ళే తన్నులు తింటుంటే వీళ్ళు మనల్నేం రక్షిస్తారన్న చులకన భావం ప్రజలనుండి వ్యక్తమయ్యే ప్రమాదం లేకపోలేదు. అది ఎవరికీ మంచిది కాదు. నిఘావర్గాలు ఇప్పటికైనా కళ్ళు తెరచి మేలుకుంటే మంచిది...!

## టీటీడీ ఉత్తర భారత స్థానిక సలహామండలి

# అధ్యక్షురాలిగా మరోసారి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



తిరుమల తిరుపతి దేవస్థానాల ఉత్తర భారత స్థానిక సలహా మండలి అధ్యక్షురాలిగా రాజ్యసభ సభ్యులు, 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డి వరుసగా రెండవసారి నియమించబడ్డారు. సెప్టెంబర్ 4వ తేదీ ఆమెకు నియామక ఉత్తర్వులను టీటీడీ జారీచేసింది. గతంలో ఆమె టీటీడీ బోర్డు సభ్యురాలిగా ఒకసారి, స్థానిక సలహామండలి సభ్యురాలిగా ఒకసారి స్వామివారి సేవలో కొనసాగారు. ఈ నియామకంతో ఆమె 3వసారి టీటీడీ పాలకమండలి సభ్యురాలైనట్లయ్యింది. సెప్టెంబర్ 5వతేదీ జరిగిన కొత్త పాలక మండలి సమావేశంలో కూడా సభ్యురాలి హోదాలో ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు.

గత రెండు సంవత్సరాలుగా ఆమె ఉత్తర భారతదేశంలోని ఢిల్లీ తదితర ప్రాంతాలలోని ఆలయాల అభివృద్ధికి పాటుపడ్డారు. ఢిల్లీలోని స్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలను ఆమె ఆధ్వర్యంలోనే నిర్వహించారు. అన్నిటికంటే ముఖ్యంగా జమ్మూ (కాశ్మీర్)లో టీటీడీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన శ్రీవారి ఆలయ నిర్మాణానికి ప్రశాంతిరెడ్డి సారధ్యంలోనే శంకుస్థాపన జరిగి, ఆమె నేతృత్వంలోనే ప్రారంభోత్సవం కూడా జరిగింది. ఇది అత్యంత చరిత్రాత్మక ఘట్టం. అక్కడ ఇప్పుడు నిత్యం రోజుకి పదివేల మంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు. ప్రశాంతిరెడ్డికి 'లాయర్' అభినందనలు.

## 'గురువులకన్నా గూగులే మిన్న'

**- విద్యా మంత్రి ఆదిమూలం!**

# ఇదేందయ్యా సామీ?



మన రాజకీయ నాయకులు వేదికలు ఎక్కితే ఏం మాట్లాడుతున్నారో వాళ్ళకే అర్థం కావడంలేదు. మంత్రులుగా వున్న వాళ్లు కూడా మైకు దొరికితే రెచ్చిపోయి పిచ్చిమాటలు మాట్లాడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కూడా ఇటీవల ఇలాంటి మాటలే మాట్లాడి అభాసుపాలయ్యారు. సెప్టెంబర్ 5వ తేదీ టీచర్స్ డే సందర్భంగా జరిగిన గురుపూజోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతూ 'మనకి గురువులు అక్కరలేదు, గురువులకు బదులు గూగుల్ వచ్చేసింది, గురువులకు కూడా తెలియని విషయాలు కూడా గూగుల్‌లో తెలిసిపోతున్నాయి' అంటూ సాక్షాత్తు గురువుల సమక్షంలోనే కామెంట్ చేశారు. మరి ఆదిమూలం ఏ గూగుల్ ద్వారా చదువుకుని ఈరోజు మంత్రి స్థాయికి ఎదిగారో ఆయనకే తెలియాలి. గూగుల్‌లో వచ్చే సమాచారం కూడా గురువులు పెట్టిందే అన్న చిన్న లాజిక్ ఆదిమూలం ఎలా మర్చిపోయారని రాష్ట్రంలోని టీచర్లు మండిపడుతున్నారు. మరోవైపు ప్రతిపక్ష నేత చంద్రబాబు ఈ విషయమై తీవ్రంగా స్పందించారు "గూగుల్ అంటే కేవలం సెర్చ్ ఇంజన్ మాత్రమే, గూగుల్లో మనం ఏం పెడితే అదే వస్తుంది, గూగుల్ సమాచారం మాత్రమే ఇస్తుంది, అదే గురువులు జ్ఞానాన్ని ఇస్తారు, ఈ మాత్రం తెలియనివాళ్ళు విద్యాశాఖకు మంత్రులుగా ఉన్నారు "అంటూ మండిపడ్డారు.

ఆదిమూలం చేసిన ఈ వ్యాఖ్యలపై 'ఇదేందయ్యా సామీ' అంటూ వైసీపీ శ్రేణులు కూడా సామాజిక మాధ్యమాలలో కామెంట్ చేయడం కొసమెరుపు..!






● చెన్నైకి విస్తరించిన స్వర్ణభారత్ సేవలు

# సేవలోనే సంతృప్తి - దీపా వెంకట్

సేవలోని సంతృప్తి వెలకట్టలేనిదని, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ (విష్ణు మోటార్స్ జి.జె.ఎం.డి) శ్రీమతి దీపా వెంకట్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ సారధ్యంలో, విష్ణు మోటార్స్ సి.ఎస్.ఆర్. నిధులతో ఇటీవల చెన్నైలోని ఎస్.కె.పి.సి. విద్యాలయంలో 3 రోజుల పాటు జైపూర్ ఫుట్ క్యాంప్‌ను నిర్వహించారు. మానవ సేవే.. మాధవ సేవ అనే భావంతో విష్ణు మోటార్స్ జి.ఎం.డి వెంకట్ యిమ్మణ్ని ఈ కార్యక్రమానికి 7.5లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులను అందించడం విశేషం. వారితో పాటు జి.ఎం.ఆర్. వరలక్ష్మి ఫౌండేషన్ 2.5 లక్షల రూపాయలను అందించింది. భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయ సమితి పర్యవేక్షణలో సెప్టెంబర్ 3 నుంచి 5 వరకూ మూడు రోజుల పాటు సాగిన ఈ క్యాంప్ ద్వారా 238 మందికి జైపూర్ కృత్రిమ అవయవాలు ఇతర సహాయ పరికరాలు అందించారు. ఇప్పటి వరకూ నెల్లూరు, విజయవాడ, హైదరాబాద్ నగరాల నుంచి గ్రామాలకు అందిస్తున్న సేవల ద్వారా స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు ఈ కార్యక్రమం ద్వారా పూర్తి స్థాయిలో తమిళనాడుకు విస్తరించటం జరిగిందని ఈ సందర్భంగా దీపా వెంకట్ తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ ద్వారా సమాజంలో దివ్యాంగులకు సహకారం అందించటానికి ప్రతి ఒక్కరూ ముందు రావాలని, ఇలాంటి కార్యక్రమాలను వినియోగించుకుని జీవితంలో దివ్యాంగులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. సమాజంలో వివిధ సమస్యలతో బాధపడుతున్న వారిని ఆదుకోవాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం కోసం తమ సి.ఎస్.ఆర్ నిధుల నుంచి రూ. 7.5లక్షల విరాళాన్ని అందించిన వెంకట్ యిమ్మణ్ణికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తాత, భారత 13వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సేవా గుణాన్ని అందిపుచ్చుకుని ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించిన విష్ణు యిమ్మణ్ణికి ఆమె అభినందనలు తెలిపారు.

## పీ.వీ.ప్రసన్నరెడ్డి అమ్మ

# పాలిచర్ల శారదమ్మ కన్నుమూత

మాగుంట సుధాకరరెడ్డి తోడల్లుడు, ప్రస్తుతం జీవీకే సంస్థలలో కీలక పదవిలో ఉన్న పీ.వీ.ప్రసన్నరెడ్డి తల్లి శ్రీమతి పాలిచర్ల శారదమ్మ సెప్టెంబర్ 4వతేదీ తెల్లవారుఝామున కన్నుమూశారు. ఆమె వయస్సు 92 సంవత్సరాలు. ఆమెకు ఇద్దరు కుమారులు. ఆమె భర్త పాలిచర్ల జనార్ధనరెడ్డి చాలాకాలం క్రితం కాలం చేశారు. నెల్లూరుజిల్లా కొడవలూరు మండలం మానేగుంటపాడు వీరి స్వగ్రామం. మానేగుంటపాడులో ప్రఖ్యాతిగాంచిన రైతు కుటుంబం పాలిచర్ల వారిది. జనార్ధనరెడ్డి ఆ గ్రామ సర్పంచిగా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికారు. రెండు దశాబ్దాలకుపైగా అంటే 2019 వరకు ఆ గ్రామంలో సర్పంచి ఎన్నికే జరగలేదు. పాలిచర్ల కుటుంబం ఎవరిని నిర్ణయిస్తే వారే ఏకగ్రీవం. తప్పనిసరి పరిస్థితులలో 2019 తరువాత జరిగిన ఎన్నికలలో ప్రసన్నరెడ్డి సోదరుడు శ్రీనివాసులరెడ్డే గెలిచారు. ఆ కుటుంబం ఆధ్వర్యంలో వారి దాతృత్వంతో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి, ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి. 1964లోనే జనార్ధనరెడ్డి తమ తండ్రి దివంగత పాలిచర్ల శంకరరెడ్డి స్మారకంగా గ్రామంలో వెటర్నరి (పశువుల) ఆసుపత్రిని తమ దాతృత్వంతో నిర్మించారు.



గ్రామ పంచాయతీ కార్యాలయం, రెడ్డిపాళెం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల, మానేగుంటపాడు ప్రాథమిక పాఠశాల వంటివి ఏర్పడడానికి పాలిచర్ల కుటుంబం తమ సొంత స్థలాలను ఉచితంగా ఇచ్చారు. గ్రామంలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి, మంచినీటి వసతి కల్పించడానికే కృషి చేశారు. గ్రామంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి నిత్యం ఆ కుటుంబం అండదండలు అందిస్తూనే ఉంటుంది.

పాలిచర్ల కుటుంబం చేసే ప్రతి కార్యక్రమానికి వారి ఇంటి దేవత శారదమ్మే స్ఫూర్తి. ఆమెకు రాజకీయాలంటే పెద్దగా ఇష్టం లేదు, కానీ పదిమందికీ సేవచేయాలనే తపన మాత్రం ఎక్కువ. సేవ చేయాలంటే రాజకీయాలే సరైన వేదిక అని ఆమె భర్త, ఆ తరువాత ఆమె కుమారులు ఆమెను ఒప్పించి గ్రామ పురోగతికి కృషి చేస్తున్నారు. తొంభై ఏళ్ళ వయసులో కూడా శారదమ్మ రోజూ తానే స్వయంగా పూలు కుట్టి ఆలయానికి పంపించేవారు.

తమ ఊరన్నా, ఊరి ప్రజలన్నా శారదమ్మకి ప్రాణం. ఆమె ఏ ఊరికి వెళ్లినా ఆమె మనసంతా మానేగుంటపాడే. ఆరోగ్యంగా ఉంటూనే అకస్మాత్తుగా ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె మరణంతో కేవలం ఆమె కుటుంబమే కాకుండా ఆ గ్రామం మొత్తం తమ పెద్ద దిక్కుని కోల్పోయినట్లుగా విచారిస్తున్నారు. శారదమ్మ ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది 'లాయర్'.

లాయర్
సెప్టెంబర్ 08, 2023

# ‘మహిళా బిల్లు’కు.. పట్టిన గ్రహణం తొలగిపోవాలి

ప్రాచీన కాలం నుంచి ఎంతో గొప్పవైన సంస్కృతి సంప్రదాయాలతో అలరారుతున్న పవిత్రమైన భారతదేశం మనది. ‘భరతమాత’ బిడ్డలుగా మనం గర్వంగా చెప్పుకుంటుంటాం. ఈ భరతభూమిపై ఎందరో మహిళామణులు పుట్టి, దేశఖ్యాతిని చాటారు. ఝాన్సీలక్ష్మీబాయి వంటి వీరనారీమణులెందరికో పుట్టుగడ్డ భారత్. దేశ నాయకురాలిగా ఇందిరాగాంధీ ఏళ్ళతరబడి పాలించడం చూశాం. దేశంలో అగ్రస్థానాల్లోనే కాక, విదేశాల్లో భారత సంతతి మహిళలు ఎందరో విఖ్యాతిపొందిన వారున్నారు. ఇప్పుడు మన భారత రాష్ట్రపతి కూడా ఒక మహిళే కావడం మనకు గర్వకారణం. దేశంలో మహిళలు అన్నిరంగాల్లో శరవేగంగా దూసుకుపోతున్నారు. వైమానికరంగం, రక్షణరంగం వంటి సాహసోపేత రంగాల్లోనూ రాణిస్తున్నారు. మొన్నటి చంద్రయాన్ రాకెట్ ప్రయోగంలోనూ అద్వితీయమైన విజ్ఞానాన్ని సొంతం చేసుకున్న మహిళా శాస్త్రవేత్తలెందరో ఉన్నారు. ఇలా చెప్పుకోవడానికి ఎన్నో గొప్పలు ఉన్నాయి.

కానీ, ఇటు కుటుంబవృద్ధికి, అటు సమాజాభ్యున్నతికి నిరంతరం పాటుపడుతూ అపారమైన సేవలందిస్తున్న మహిళలకు మాత్రం మనదేశంలో తగు ప్రాతినిధ్యం లేకపోవడమే బాధాకరం. దేశజనాభాలో సుమారు 48.5 శాతం మంది, అంటే దాదాపు 70 కోట్లకు పైగానే..సగం మందిదాకా మహిళలున్నారు. వాళ్ల ఓట్లే ఏ రాజకీయనాయకునికైనా కీలకం కూడా. అయినా, ‘ఆకాశంలో సగం’ అంటూ ఉబ్బరమాటలతో ఆకాశానికెత్తుతారే కానీ, చట్టసభల్లో మాత్రం మహిళలకు ఆశించిన స్థానాలు ఇవ్వకుండా దూరంగానే ఉంచుతుంటారు. అన్ని రంగాల్లో సమానావకాశాలు అంటూ మాటలతో మాయ చేస్తారే తప్ప రాజకీయరంగంలో మాత్రం ఏమాత్రం ప్రాతినిధ్యం ఇవ్వడం లేదు. పార్లమెంట్‌లోను, రాష్ట్రాల్లోని శాసన సభల్లోనూ కూడా మహిళలకు మూడింట ఒకవంతు అంటే కనీసం 33 శాతం సీట్లను కేటాయించడానికి కూడా ఆదినుంచీ అపశృతులే. మహిళా బిల్లు తెచ్చేందుకు రాజ్యాంగ సవరణ బిల్లును 1996 సెప్టెంబరు12న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినప్పటి నుంచీ అదేం దురదృష్టమో తెలియదు కానీ, ఆ బిల్లుకు నేటికీ అతీగతీ లేదు. గతంలో రెండుమూడు సార్లు బిల్లుపై చర్చలు పెట్టినా ఫలవంతం కాలేదు. పార్లమెంట్‌లో ఇప్పటికీ అదో ‘పెండింగ్ ఫైల్’గా అటకెక్కింది. ఎన్నికలొచ్చినప్పుడు మాత్రం దేశంలో మహిళా ఓటర్లు కోట్ల సంఖ్యలో ఉన్నారు కనుక, మహిళలకు ఉత్తుత్తి వాగ్దానాలు చేస్తుంటారు. గత తొమ్మిదేళ్లుగా భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్నా ఆ బిల్లు విషయం పట్టించుకోలేదంటే నాయకుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు, మహిళా బిల్లు తెస్తామంటూ ఎన్నికల ప్రణాళికల్లో హామీలు గుప్పించిన బీజేపీ కూడా ఇప్పటిదాకా ఆ బిల్లు జోలికి పోలేదంటే ఏమనుకోవాలి?.. 2010లో రాజ్యసభ ఆ బిల్లును ఆమోదించినా పార్లమెంట్ మాత్రం ఆమోదముద్ర వేయలేదు. రాజకీయరంగంలోనూ మహిళలు తీసిపోరు. ఇప్పటికే తమ ప్రతిభా పాటవాలతో ఎందరో మహిళలు అటు అసెంబ్లీల్లోనూ, ఇటు పార్లమెంట్ లోనూ ఉన్నారు. పార్లమెంట్‌లో ప్రస్తుతం 543 మంది సభ్యులుంటే అందులో మహిళా ఎంపీలు 78 మంది వరకూ ఉన్నారు. దేశం మొత్తమ్మీద 4235 శాసనసభా స్థానాలుంటే, మహిళా ఎమ్మెల్యేలు 476 మంది ఉన్నారు. కానీ ఈ సంఖ్య చాలా తక్కువే. మొత్తంగా కేవలం 15శాతం కంటే తక్కువగానే ఇప్పుడు మహిళల ప్రాతినిధ్యం ఉంది. అదేకనుక మహిళా బిల్లు వస్తే, పార్లమెంట్‌లో 543 స్థానాలకు గాను కొంచెం హెచ్చుతగ్గులుగా కనీసం 180 మంది మహిళలకు రాజ్యాంగ బద్ధంగా.. ఒక హక్కుగా వచ్చే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వాలు మారుతున్నాయి..పాలకులు మారుతున్నారే తప్ప మహిళల తలరాతలు మాత్రం మారడం లేదు. మహిళల చిరకాల కోరిక ఎంతకాలం గడిచినా నెరవేరడం లేదు. త్వరలో పలు రాష్ట్రాలకు ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో మహిళాబిల్లుపై దేశవ్యాప్తంగా మళ్ళీ చర్చ జరుగుతోంది. ఆ బిల్లును బీజేపీ వచ్చే సమావేశాల్లో ప్రవేశపెడుతుందా?. లేకుంటే ఆ ఆలోచనలను వాయిదా వేసుకుంటుందా?.. అన్నది ఇప్పుడు రాజకీయవర్గాల్లో పెద్ద చర్చగా ఉంది. ఒకవేళ ఆ బిల్లును తెచ్చి, ఎన్నికల్లో అదొక బ్రహ్మాస్త్రంగా ప్రయోగించే ఆలోచనలు బీజేపీకి లేకపోలేదని కూడా రాజకీయవర్గాల భోగట్టా. ఏదేమైతేనేం..ఆ బిల్లు వస్తే మంచిదే కదా!.. ఈనెల 18 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లోనైనా ఆ కల సాకారమవుతుందేమో.. వేచి చూద్దాం. మహిళా బిల్లుకు ఏళ్లతరబడి పట్టిన గ్రహణం ఇకనైనా తొలగిపోతుందనే ఆశిద్దాం!..

# తడ నుండి నెల్లూరుకి ఆరులైన్ల రహదారి కావాలి

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

తడ నుండి నెల్లూరు వరకూ జాతీయ రహదారిపై ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. చెన్నై నుండి కలకత్తా వరకు వాహనాలు వెళ్ళడానికి ఉన్న ప్రధాన రోడ్డు మార్గం ఇదే. ఇరవై ఏళ్ళ క్రితం నాలుగులైన్ల రహదారిగా మారిన ఈ జాతీయ రహదారి నెం-16 అక్కడితో ఆగిపోయింది. అప్పట్లో తడ నుండి ఇచ్ఛాపురం వరకు నాలుగు లైన్ల రహదారిని నిర్మించారు. ఆ తరువాతి కాలంలో నెల్లూరు నుండి ఇచ్ఛాపురం దాకా చాలా వరకు ఈ రహదారిని ఆరులైన్లకు విస్తరించారు. నిత్యం పెరుగుతున్న వాహన రాకపోకల సంఖ్యని దృష్టిలోపెట్టుకుని ఈ దారిని వెడల్పు చేశారు. తడ నుండి చెన్నై, ఆ తరువాత మధురై, కన్యాకుమారి వరకు కూడా దాదాపుగా అన్నీ ఆరులైన్ల రహదారులుగా అభివృద్ధి చేసేశారు. తడ నుండి నెల్లూరు వరకు మాత్రం ఇంకా నాలుగు లైన్లతోనే వాహనదారులు అవస్థపడుతున్నారు. ఆ మార్గంలో ప్రమాదాల సంఖ్య కూడా ఎక్కువగా ఉంది. పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డుని విస్తరించకపోవడమే ఇందుకు కారణం. తాజాగా ఈ మార్గాన్ని అదానీ సంస్థ కొనుగోలు చేసిందని వార్తలు వస్తున్నాయి. వారి ఆధ్వర్యంలోనైనా సాధ్యమైనంత త్వరలో ఈ రహదారిని 6 లేదా 8 లైన్లకు విస్తరిస్తే బాగుంటుంది.

ఎన్.వీ.సురేష్, నెల్లూరు.

## ‘సత్యపీఠం’ బాగుంది!

గత వారం నుండి మన ‘లాయర్’లో ప్రారంభించిన ‘సత్యపీఠం’ ఆలోచన బాగుంది. ఏకపక్ష వార్తలతో అబద్ధాలను వండి వడ్డిస్తున్న మీడియా ఛానెళ్ళు, వార్తా పత్రికలపై విరక్తి కలుగుతోంది. జరిగిన సంఘటనని ఒక్కొక్క పత్రిక ఒక్కొక్క విధంగా విశ్లేషిస్తున్నాయి. కానీ, అసలు జరిగిన విషయం వేరేగా ఉంటుంది. ఈ సత్యపీఠంతో కనీసం కొన్నైనా వాస్తవాలు, నిజాలు చర్చించుకునే అవకాశం కలుగుతుంది. సాహసోపేత నిర్ణయం తీసుకున్న ‘లాయర్’కి అభినందనలు..!

– ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.

## ఇస్రో శాస్త్రవేత్తలకి అభినందనలు

చంద్రయాన్ సంబరాలు, సంతోషాలు కొనసాగుతుండగానే ఆదిత్య ఎల్-1ని విజయంతంగా సూర్యుడి దగ్గరకు పంపి తమ సత్తాచాటారు ఇస్రో శాస్త్రవేత్తలు. విజయవంతంగా వరుస ప్రయోగాలు చేస్తూ ప్రపంచ అంతరిక్ష పరిశోధనా రంగాన్ని ఆకట్టుకుంటున్న మన మేధావులకు అభినందనలు. 1963 నుండి 2023 వరకు అంటే... ఈ 60 సంవత్సరాలుగా పరిశోధనలు సాగిస్తున్న శాస్త్రవేత్తలు ఇస్రో షష్టిపూర్తి కానుకగా వరుస విజయాలను అందిస్తున్నారు. వ్యవస్థాపక ఛైర్మెన్ విక్రమ్ సారాభాయ్ దగ్గర నుండి ఆ తరువాత పరిశోధనలకు నాయకత్వం వహించిన ఎం.జి.కే.మీనన్, సతీష్ ధావన్, యు.ఆర్.రావు, కే.కస్తూరి రంగన్, మాధవన్ నాయర్, కే.రాధాకృష్ణన్, ఏ.ఎస్.కిరణ్‌కుమార్, కే.శివన్ లతో పాటు ప్రస్తుత ఛైర్మన్ ఎస్.సోమనాథ్ వరకూ అందరూ చరితార్థులే. ఎవరి స్థాయిలో వాళ్ళు చేసిన కృషి ఫలితమే ఇప్పుడు వరస విజయాలకు స్ఫూర్తి దాయకమైంది. ఈ ఆనంద సమయంలో వారందరినీ ఒక్కసారి గుర్తు చేసుకుంటూ... ఎందరో మేధావులు అందరికీ వందనాలు!

– లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.

# సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 2

## ఆత్మ ‘సాక్షి’గా...

# రాజశేఖరరెడ్డి పేరుని తెరమరుగు చేసే ప్రయత్నం!

డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి. ఆ పేరు ఒక్క తెలుగు రాష్ట్రాలలోనే కాదు దేశ రాజకీయాలలోనే పెనుసంచలనం. ఆయన, విద్యార్థి దశలో రాజాగా ఉద్యమాలకు సారథ్యం వహించిన యువ నాయకుడు. పట్టభద్రుడైన తరువాత డాక్టర్ రాజశేఖర్‌గా ప్రజల నాడెరిగిన వైద్యుడు. రాజకీయాలలోకి అడుగుపెట్టిన తరువాత వై.ఎస్. రాజశేఖరరెడ్డిగా ప్రతి తెలుగు హృదయంలో కొలువైన ప్రజా సేవకుడు. మరణించిన తరువాత కూడా జీవిస్తూ వై.ఎస్.ఆర్.గా కొన్ని లక్షల కుటుంబాల గోడలపై వెలసిన మహా నాయకుడు. తన ప్రతి అడుగులోనూ సమాజాన్ని ప్రభావితం చేసిన మానవీయ విలువలున్న నేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి. ఆయన ఆకస్మిక మరణానంతరం కొన్ని లక్షల కుటుంబాలు తమ కుటుంబసభ్యులలో ఒకరిని పోగొట్టుకున్నట్లుగా విలపించాయి. కొన్ని కోట్లమంది భోరున విలపించారు. కొన్ని వందల గుండెలు ఆగిపోయాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు మనుగడ సాగించినంతవరకూ గుర్తుండిపోయే పేరు రాజశేఖరరెడ్డిది. అలాంటి రాజశేఖరరెడ్డి పేరుని తెరమరుగు చేసే ప్రయత్నం ఆ కుటుంబ కోటరీ నుండే జరుగుతోందా అన్న అనుమానం ఆయన అభిమానులను ఇప్పుడు కలవరపెడుతోంది.

రాజశేఖరరెడ్డి రాజకీయ వారసుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత పత్రిక ‘సాక్షి’ సైతం రాజశేఖరరెడ్డి జయంతి, వర్ధంతులకు కూడా ప్రాధాన్యత తగ్గిస్తుందా...? అన్న ప్రశ్న వై.ఎస్. అభిమానుల నుండి వినపడుతోంది. రాజశేఖరరెడ్డి దివంగతులైన ఈ పద్నాలుగు సంవత్సరాలలో ఒక్క ఏడాది కూడా వై.ఎస్. జయంతి, వర్ధంతులకు సాక్షి పత్రికలో ప్రకటన రాలేదు. కేవలం ప్రత్యేక వ్యాసాలకి ప్రాధాన్యత కల్పించి సరిపెడుతున్నారు తప్ప, తమ సొంత పత్రికలో ఆయనను సంస్మరించుకుంటూ ఒక్క ప్రకటన కూడా ఇవ్వలేదు. తమ పత్రిక వార్షికోత్సవానికి, నాయకుల పుట్టిన రోజులకి, ప్రభుత్వ యానివర్సరీకి పేజీలకొద్దీ ప్రకటనలు సేకరించి ప్రకటిస్తున్న సాక్షి సిబ్బంది రాజశేఖరరెడ్డి జయంతి, వర్ధంతులను పట్టించుకోకపోవడం అన్యాయమన్న



తండ్రి రాజశేఖరరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్

అభిప్రాయం చాలా సందర్భాలలో ఆయన అనుయాయులు, అభిమానులనుండి వ్యక్తమైంది. ఇది రాజశేఖర కుటుంబసభ్యులో లేక సాక్షి సిబ్బందో చేస్తున్న తప్పిదంగా వై.ఎస్. అభిమానులు భావించడంలేదు. ఎవరో జగన్‌మోహన్‌రెడ్డి దగ్గర మెహర్బానీ కోసం ఆయనను తప్పుత్రోవ పట్టిస్తున్నారని వై.ఎస్. అనుచరగణం ఆందోళన చెందుతోంది.

గడచిన సంవత్సరాల సంగతి పక్కనపెడితే ఈ ఏడాది మొన్న సెప్టెంబర్ 2వ తేదీన రాజశేఖరరెడ్డి వర్ధంతి. ఆరోజున సాక్షాత్తు రాజశేఖరరెడ్డి కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఇడుపులపాయకి వెళ్ళి తన తండ్రి, దివంగత మహానేత రాజశేఖరరెడ్డి సమాధివద్ద నివాళులు అర్పిస్తే, ఆ ఫోటో సాక్షిలో ప్రచురితం కాలేదు. మొదటి పేజీలో రావలసిన వార్త, ఫోటో అసలు సాక్షి పత్రికలోనే కనపడకపోవడం వై.ఎస్. కుటుంబ అభిమానులను విస్మయపరచింది.

గతంలో ఆ జననేతను సంస్మరించుకుంటూ వాడవాడలా ఆయన విగ్రహాలు పెట్టారు. ఆయన తుదిశ్వాస విడిచిన పావురాళ్ళగుట్టని చరిత్రాత్మక స్మారక సందర్శనా కేంద్రంగా మారుస్తామని ప్రకటించారు. ఒకప్పుడు ప్రతీక్షణం ఆయన పేరుని జపించారు. ఇప్పుడు క్రమేణా ఆయన ప్రభుత్వ పథకాలకు కూడా ఆయన పేరుని తగ్గిస్తున్నారు. ఈరోజు జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీలో ప్రభుత్వంలో ఉన్న 90శాతం మంది ఊరూ పేరు లేని వాళ్ళే. వారిపైన జగన్ అనే గొడుగు లేకపోతే వాళ్లంతా ఒకటి పక్కన సున్నాతో సమానమే. అధికారంలోఎవరున్నా రాజశేఖరరెడ్డిని మరపించే స్థాయిలో ప్రజల మనసు దోచుకోవాలి, ఆయన తరహాలో మన అనుకున్నవాళ్ళని దగ్గర చేసుకోవాలి, మానవతా దృక్పథంతో విశ్వసనీయతని సాధించాలి. ఆయనకన్నా ఈయన గొప్పవాడు అని జనం కీర్తించేస్థాయిలో ఆదరణ, అభిమానం సంపాదించాలి. అంతే తప్ప పథకాలకు ఆయన పేరుని తొలగిస్తేనో, పత్రికలలో ఆయన ప్రస్తావన తేకపోతేనో జనం ఆయనని మర్చిపోరు. ఈ ఆలోచన ఎవరిదైనా తప్పే. ఈ పని ఎవరుచేసినా దుర్మార్గమే..! జగన్‌మోహన్‌రెడ్డి పక్కనే వుంటూ పార్టీని, ప్రభుత్వాన్ని, అధికారులను శాసిస్తున్న కీలక వ్యక్తులు ‘ఆత్మ’సాక్షిగా ఆలోచించుకోవాలి, వై.ఎస్. అన్న పేరు లేకపోతే జగన్‌మోహన్‌రెడ్డైనా ఒకటి పక్కన సున్నానే అన్న వాస్తవం గ్రహించాలి..!

- రాజశ్రీ



## రైల్వేస్టేషన్‌లో భయం భయం
### చివరికి 'ఉత్తదే' అని తేలింది

# బాబోయ్!... 'బాం....బు'

**ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే నెల్లూరు రైల్వేస్టేషన్ ఒక్కసారిగా ఉలికి పడింది. బాంబు భయంతో బెంబేలెత్తిపోయింది. పోలీసులు, బాంబు స్క్వాడ్‌లు, డాగ్‌స్క్వాడ్‌లు పరుగెత్తుకు వచ్చారు. అణువణువు గాలించారు. చివరికి అదెవరో ఆకతాయి ఇచ్చిన సమాచారం అని తేలడంతో ఒక్కసారిగా 'హమ్మయ్య' అంటూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.**

ఈనెల 4వ తేదీ...సోమవారం..మధ్యాహ్నం 3.40 గంటలు కావస్తోంది. ఎవరో అపరిచిత వ్యక్తి నుంచి రైల్వేస్టేషన్‌కు ఫోన్‌కాల్ వచ్చింది. 'ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పై బాంబు ఉంది. త్వరలో పేలిపోతుంది' అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. డయల్ 112 నంబరుకు వచ్చిన ఆ ఫోన్‌కాల్‌తో రైల్వే సిబ్బంది భయపడిపోయారు. అధికారులకు ఆ విషయం చెప్పడంతో, వెంటనే రైల్వే పోలీసులు, సంతపేట పోలీసులు అప్రమత్తమ య్యారు. హుటాహుటిన రైల్వేస్టేషన్‌కు రయ్‌మంటూ వచ్చేశారు. వారితో పాటే బాంబులను కనిపెట్టే బాంబ్‌స్క్వాడ్‌లు, డాగ్‌స్క్వాడ్‌లు కూడా పరుగెత్తుకు వచ్చాయి. రైల్వే డీఎస్పీ మల్లికార్జునరావు, సిఐ శ్రీనివాసాచారి, ఎస్‌ఐ హరిచందన, సంతపేట సిఐ కల్యాణ్‌రాజు, పోలీసు బృందాలు ఆగమేఘాలమీద రైల్వేస్టేషన్‌కు వచ్చి ప్లాట్‌ఫామ్ మీదున్న ప్రయాణీకు లను దూరంగా వెళ్ళండంటూ హెచ్చరించారు. దీంతో ప్రయాణీకుల్లో కూడా కలకలం రేగింది. అందరిలో ఉత్కంఠ..అసలే బాంబు భయం. పోలీసులు రైల్వేస్టేషన్ మొత్తం గాలించారు. చివరికి ప్రయాణీకుల బ్యాగ్‌లను కూడా తనిఖీ చేశారు. అయితే, ఎంత వెదికినా బాంబు జాడ కనిపించకపోవడంతో, అదెవరో ఆకతాయి కావాలనే ఆట పట్టించాలని అలా ఫోన్ చేసి ఉంటాడని నిర్ధారించారు. రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఫోన్ ఆధారంగా ఆ అపరిచిత వ్యక్తి జిల్లాలోని పెద్దబ్బీపురం గ్రామానికి చెందినవాడై ఉం టాడని అనుమానిస్తున్నారు. ఏదేమైనా... కొద్ది గంటల పాటు రైల్వేస్టేషన్ సిబ్బంది, పోలీసులు, ప్రయాణీకులు బాంబు భయంతో హడలిపోయారు. బాంబు ఉందంటూ అందరినీ భయపెట్టిన ఆ అపరిచిత వ్యక్తికోసం పోలీసులు గాలిస్తున్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో.. పోషణ మాసోత్సవం



నెల్లూరు బాలాజీ నగర్ పరిధిలోని రాయపు పాళెం అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్ వైజర్ ఎం.నాగేశ్వరి ఆధ్వర్యంలో ఈనెల 5న పోషణ మాసోత్సవం నిర్వహించి పోషకాహారం పట్ల అవగాహన కలిగించారు. గర్భవతులు, బాలింతలు, తల్లులు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహారం ఉండే పదార్థాలు ముఖ్యంగా కూరగాయలు, పండ్లు వగైరాలను తీసుకోవాలని, బిడ్డ పుట్టిన వెంటనే ఆరునెల వరకు తల్లిపాలు మాత్రమే బిడ్డకు ఇవ్వాలని, 7వ నెల నుండి తల్లిపాలతో పాటు బాలామృతం, కోడిగుడ్లు వంటి పోషకాహార పదార్థాలు ఇవ్వాలని ఆమె చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇస్తున్న వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణను గర్భవతులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు డి.అరుణ, ఆర్. కామాక్షి, ఎం.పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి



భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 135వ జయంతిని సెప్టెంబరు 5న స్థానిక క్రాంతినగర్ మున్సిపల్ స్కూల్లో నిర్వహించారు. నెల్లూరులోని సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు సర్వేపల్లి రామ్మూర్తి, సతీష్‌చంద్ర, శివకుమార్ పాల్గొని రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఆర్డీవో ఏ. మలోలా. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్, ప్రముఖ సాహితీవేత్త డా. కాళిదాసు పురుషోత్తం. డాక్టర్ ఏ.రూప, డా.పాతూరి అన్నపూర్ణ, గోవిందరాజు సుభద్రాదేవి. వాసుదేవ, అవ్వారు శ్రీధర్‌బాబు. ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ● కందుకూరు అంకమ్మ దేవాలయానికి పూర్వవైభవం...





# రూ. 5 కోట్లతో కనువిందుగా పునర్నిర్మాణం

### ○ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిదే పుణ్యమంతా

కందుకూరులో అంకమ్మ అమ్మవారి దేవాలయానికి పూర్వవైభవం తెచ్చి పెడుతూ, కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి అందరి ప్రశంసలందుకుంటు న్నాడు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగా రంగా, మహిమాన్విత శక్తిస్వరూపిణిగా పేరొందిన గ్రామదేవత అంకమ్మ అమ్మ వారి ఆలయం కందుకూరులో ఎంతో కాలంగా ఉంది. ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లో ఎంతోమంది ప్రజలకు కందు కూరు అంకమ్మంటే ఎంతో భక్తి. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అంకమ్మ దేవాలయాలున్నా కందుకూరు అంకమ్మ తల్లికి మరింత విశిష్టత. ఎంతో అరుదైన, శక్తివంతమైన దేవాలయం ఇది. కాలక్ర మంలో ఆ దేవాలయం జీర్ణోద్ధరణకు చేరుకోవడంతో అమ్మవారి భక్తుడైన ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, నాయకులతో సంప్రదింపులు జరిపి, దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. అమ్మ వారి భక్తులకు కొదవలేదు కనుక, అడిగి అడక్కముందే అమ్మవారికి విరాళాలు భారీగానే వచ్చాయి. లక్షల నుంచి కోట్లల్లో డబ్బు వచ్చింది. భక్తులు, దాతల సహకా రంతో ఆలయాన్ని పునర్నిర్మాణం చేయిం చారు. కొద్దిరోజుల్లోనే ఆలయం రూపే మారిపోయింది. శిల్పకళా నైపుణ్యంతో సర్వాంగసుందరంగా తయారైంది. వం దల సంవత్సరాల నుంచి ఉన్న అంకమ్మ ఆలయం జీర్ణోద్ధరణ జరగాలనే భక్తుల కోరిక నెరవేరింది. అందులోనూ అమ్మవారి ఆలయమంతా నాటి అపూర్వమైన రాతి కట్టడం. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహో త్సవం కూడా ఈనెల 7వ తేది గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. అంకమ్మ అమ్మవారి నామోచ్చారణతో కందుకూరు మారుమోగిపోయింది. రెండు జిల్లాల నుంచే కాక, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంకమ్మ తల్లి భక్తులు కొల్లలుగా ఈ వేడుకలకు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో 5వ తేదీనుంచి భారీఎత్తున పూజలు, హోమాలు ప్రారంభమయ్యాయి. సోమ వారం రాత్రి అమ్మవారి మూల విరాట్‌కు పెద్దఎత్తున జరిగిన నగరోత్సవానికి అన్న దానదోహంతో వేలసంఖ్యలో భక్తజనం తరలివచ్చారు. ఎట్టకేలకు.. ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, ప్రముఖులు, ప్రజలు అందరూ కలసి అమ్మవారి దేవాలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించుకోవడం విశేషం.

# నలుగురికి రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ పురస్కారాలు



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రప్రభుత్వం నెల్లూరుజిల్లాకు చెందిన నలుగురు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలిచ్చి గౌరవించింది. విశాఖపట్నంలో సెప్టెంబరు 5న జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా ఉపాధ్యాయులకు ఈ అవార్డులు లభించాయి. పురస్కారాలు అందుకున్నవారిలో నెల్లూరులోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీధర్‌రెడ్డి, వెంకటాచలం మండలం గొలగమూడిలోని ఎంజెపి పీబీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డి.కొండలరావు, తోటపల్లి గూడూరు మండలం చెన్నపల్లి పాళెం జడ్పీ ఉన్నతపాఠశాల ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ సిహెచ్‌వి ఫణికుమార్, కొడవలూరు ఎంపీపీఎస్ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న టి.లక్ష్మీభవాని లు ఉన్నారు.

# ఊళ్ళల్లో గుళ్ళ దొంగల హల్‌చల్

## దేవాలయాలనే దోచేస్తున్నారు
### ➢ ఒకేరాత్రి 6 ఆలయాల్లో చోరీలు



**జిల్లాలో గుళ్ల దొంగలు మితిమీరిపోతున్నారు. దేవాలయాలన్నా, దేవుడన్నా వారికి లెక్కేముంది..ఎక్కడ ఏది దొరికితే అది దోచుకోవడమే పని. ఒకే రోజు, ఒకే పంచాయతీలోని రెండు ఊళ్ళల్లో ఏకంగా ఆరు ఆలయాల్లో దొంగలు దూరి హుండీలు పగలగొట్టి డబ్బు, నగా నట్రా అంతా దోచుకుపోయారు. దీంతో ఇంకా ఏం అరిష్టాలు దాపురిస్తాయోనని ఆయా గ్రామాల్లో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.**

దుత్తలూరు మండలం బోడావారి పల్లి, మందాలనాయుడుపల్ల గ్రామాల్లో దొంగలు దేవాలయాలను లక్ష్యంగా పెట్టు కుని దొంగతనాలకు పాల్పడ్డారు. ఆల యాల తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్ళి, హుండీలు కూడా పగలగొట్టి అం దులో భక్తులు సమర్పించిన కానుకలన్నీ ఎత్తుకుపోయారు. ఆ గ్రామాల్లో ఉన్న శివాలయం, వెంకటేశ్వరాలయం, వినాయక స్వామి, ఆంజనేయస్వామి దేవాలయాలు, పోలేరమ్మ గుడి, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో ఉన్న డబ్బు దస్కం అంతా కలిపి సుమారు లక్షరూపాయల దాకా దోచుకుపోయినట్లు సమాచారం. శివా లయంలో అమ్మవారి మంగళసూత్రాలు, పోలేరమ్మ అమ్మవారి ముక్కుపుడకలు కూడా కాజేశారు. ఆలయాల్లో ఉన్న హుండీలన్నీ పగలగొట్టి నాశనం చేశారు. తెల్లారిన తర్వాత గ్రామస్తులు ఈ చోరీలు గమనించి భయాందోళనలకు గురయ్యారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుత్తలూరు ఎస్‌ఐ ప్రభాకర్, పోలీసు సిబ్బందితో వచ్చి ఆలయాలను పరిశీలిం చారు. దొంగతనాలు ఎలా జరిగాయో గ్రామస్తుల నుంచి వారికి తెలిసిన సమా చారాన్ని రాబట్టారు. ప్రత్యేక బృందాలతో దొంగల ఆట కట్టించేందుకు పోలీసు అధి కారులు రంగంలోకి దిగారు. ఆలయాల్లో దొంగతనాలు జరగకుండా చూడాలని, సీసీ కెమెరాల నిఘాను అన్ని మారుమూల గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో కూడా ఏర్పాటుచేయాలని, పోలీసు బందోబస్తు పెంచాలని ఈ సందర్భంగా గ్రామస్తులు కోరుతున్నారు.

# నెల్లూరు కబుర్లు



### తిక్కన ప్రాంగణంలో..

## గురుపూజోత్సవం

సెప్టెంబరు 5న మాజీ రాష్ట్రపతి, భారతరత్న డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, అదేరోజున ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా, సమాజాన్ని తీర్చిదిద్దే గురువులను గౌరవించుకుంటూ నెల్లూరు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో గురుపూజోత్సవం జరిగింది. పలువురు ఉపాధ్యాయులకు సన్మానాలు జరిగాయి. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తొలుత డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ మహనీయుని అడుగుజాడలే ఆదర్శంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సమాజాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాలని అరుణమ్మ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. విద్యాబోధన ఒక వృత్తిగా కాక, బాధ్యతగా భావించాలని, తద్వారా సమసమాజ స్థాపనకు కృషి చేయాలని పర్వతరెడ్డి పేర్కొన్నారు. నగర మేయర్ స్రవంతి, జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జి నారాయణరావు, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రమేష్, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటయ్య, ఉప విద్యాశాఖ అధికారులు రఘురామయ్య, ప్రసన్నలక్ష్మి, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు మెబీనా తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ రాజరాజేశ్వరి దేవాలయంలో..

## కాత్యాయని వ్రతం

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల 5న కాత్యాయని వ్రతాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామశర్మ, రవీంద్ర, వేదపండితుడు వెంకట రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రత్నం జయరామ్, ఇఓ శ్రీనివాసులురెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

### భాస్కరరావుకు...

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

### రాష్ట్రపతి చేతులమీదుగా నెల్లూరీయునికి పురస్కారం



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల జాబితాలో రాష్ట్ర ఉపాధ్యాయుల్లో ముగ్గురికి చోటు లభించగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాకు చెందిన ఒక ఉపాధ్యాయునికి ఈ అరుదైన గౌరవం లభించింది. నెల్లూరులోని కొండాయపాళెం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న మేకల భాస్కరరావుకు ఈ ఘనత దక్కింది. ఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన ఈ విశిష్టమైన అవార్డును స్వీకరించారు. అవార్డుతో పాటు, మెరిట్ సర్టిఫికెట్, రజత పతకం, 50వేల రూపాయల బహుమతిని కూడా ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా భాస్కరరావును జిల్లాలోని అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## కొత్త డిఆర్‌ఓగా లక్ష్మీశివజ్యోతి

### ➢ వెంకటనారాయణమ్మ బదిలీ



జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్‌ఓ)గా ఉన్న వెంకటనారాయణమ్మను బదిలీ చేస్తూ, ఆ స్థానంలో కొత్తగా బాపట్లలో డిఆర్‌ఓగా ఉన్న లక్ష్మీశివజ్యోతిని నియమిస్తూ ఈనెల 5న ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. వెంకటనారాయణమ్మను అమరావతిలోని జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా డెప్యూటి కలెక్టర్ల బదిలీల్లో భాగంగా, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న చినఓబులేసును తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్‌గా, వి. దేవేందర్‌రెడ్డిని జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ( విపత్తుల నివారణ విభాగం) డీపిఎంగా నియమించారు. నెల్లూరు కలెక్టరేట్‌లో భూసేకరణ విభాగంలో పనిచేస్తున్న టి.పద్మావతిని చిత్తూరు డిఆర్‌ఓగా బదిలీ చేశారు.

### 'విశ్వసాయి'లో..

## ఉపాధ్యాయ దినోత్సవం



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి కళాశాల అన్నమయ్య క్యాంపస్‌లో ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం వేడుకగా జరిగింది. కళాశాల ఛైర్మెన్ డా.ఎన్ సత్యనారాయణ మాజీ రాష్ట్రపతి, భారతరత్న డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. గురువు దైవంతో సమానమని, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులను అందరూ గౌరవించాలన్నారు. కళాశాల వైస్‌ఛైర్మెన్ కృష్ణమోహన్ మాట్లాడుతూ, 1962 నుంచి కేంద్రప్రభుత్వం డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటోందని, ఆ మహనీయుని ఆశయాల బాటలో విద్యార్థులంతా నడవాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### డా. కిషోర్స్ రత్నంలో

## కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని నెల్లూరులోని రిత్విక్ ఎన్‌క్లేవ్ వద్ద ఉన్న డా. కిషోర్స్ రత్నం థింక్ నెక్స్ట్ స్కూల్‌లో ఈనెల 5న కృష్ణాష్టమి వేడుకలు సందడిగా జరిగాయ. విద్యార్థులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించారు. కళాశాల డైరెక్టర్లు డా. కృష్ణకిషోర్, వాసంతి, రోహిణి, ప్రధానోపాధ్యాయుడు ఎం.కల్యాణి, మేనేజర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు కూడా ఈ పాఠశాలలో ఘనంగా నిర్వహించి, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు చెప్పారు.

## 'తంగిరాల మహాభారతం' 71వ భాగం




శిశుపాలుడు స్వయానా శ్రీకృష్ణుని మేనత్త కొడుకు. శ్రీకృష్ణునికి 5గురు మేనత్తలు. వారిలో సాత్వతి, ఆమె భర్త దమఘోషునికి పుట్టినవాడే శిశుపాలుడు. పుట్టినప్పుడు శిశుపాలుడు నాలుగు చేతులతో, మూడు కళ్ళతో జన్మించాడు. అప్పుడు అశరీరవాణి ఆకాశం నుంచి, ఈ పిల్లవాణ్ణి ఒకానొక మహనీయుడు వచ్చి ఎత్తుకుంటే, పిల్లవాని రెండు చేతులు, మూడవ కన్ను మాయమయిపోతాయి, కానీ, ఆ మహనీయుడు చేతిలోనే మరణిస్తాడని చెపుతుంది. ఎవరు ఎత్తుకున్నా ఏమీ జరగదు కానీ, కృష్ణుడు ఎత్తుకోగానే, అవి మాయమైపోతాయి. సాత్వతి కోరిక మేరకు, శిశుపాలుడు నూరు తప్పులు చేసేవరకు మన్నిస్తానని అభయమిస్తాడు. భీష్ముడు, శిశుపాలుని మరణం శ్రీకృష్ణుని చేతిలోనే ఉందని అన్నప్పుడు శిశుపాలునికి కోపం వచ్చి భీష్మ్మణ్ణి నిందిస్తాడు. అలాగే శ్రీకృష్ణుడు చిన్నతనంలో చేసిన ఘనకార్యాలని చులకనగా మాట్లాడి అవమానిస్తాడు. శ్రీకృష్ణుడు కూడా శిశుపాలుడు చేసిన దుష్కార్యాలని చెప్పి, అతడు చేసిన తప్పులని మనసులో లెక్కపెట్టుకుంటూ, నూరు దాటగానే, తన సుదర్శన చక్రంతో శిశుపాలుని శిరస్సుని ఖండిస్తాడు. అలా రాజసూయ యాగం సమాప్తమయినప్పుడు అందరూ తమ తమ దేశాలకు తరలి వెళ్ళిపోతారు. కానీ, దుర్యోధనుడు అతని సహోదరులు మయసభ చూడాలని ఉండిపోతారు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.






## వివిఎస్‌యు పాలకమండలి సమావేశం

వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో ఈనెల 4న వైస్ చాన్సలర్ ఆచార్య జిఎం సుందరవల్లి నేతృత్వంలో పాలకమండలి సమావేశం జరిగింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నియమించిన పాలకమండలి సభ్యులతో జరిగిన ఈ ప్రత్యేక పాలకమండలి సమావేశంలో వర్శిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, నియామకాలు తదితర అంశాలపై చర్చించారు.

## చేవూరు పుట్టినరోజున.. సేవా కార్యక్రమాలు




జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 5న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లూరులోని ఇందిరాభవన్‌లో రక్తదానశిబిరం నిర్వహించడంతో పాటు, స్థానిక రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలలో పేదలకు దుప్పట్లు పంపిణీచేశారు. ఎన్‌ఎస్‌యుఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, నాయకులు ఫయాజ్, సురేష్‌బాబు, లతారెడ్డి, రాజా, రాజేష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, హుస్సేన్‌బాషా, గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్నా!.. మా గుండెల్లో నీ స్థానం చెరిగిపోదన్నా!

## • వైఎస్సార్ వర్ధంతిలో నాయకులు, అభిమానులు

**'మా హృదయాల్లో నీవెప్పటికీ ఉంటావు రాజన్నా!.. మిమ్మల్ని మేం మరచిపోలేం'..అంటూ దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని తలచుకుని, ఆయన రాష్ట్రానికి-ప్రజానీకానికి చేసిన అపూర్వమైన సేవలను అభిమానులు, నాయకులు స్మరించుకున్నారు.**



సెప్టెంబరు 2న రాజన్న 14వ వర్ధంతి. ఈ సందర్భంగా జిల్లాలోని అశేష అభిమానులు, వైకాపా నాయకులు, ప్రముఖులు, పెద్దసంఖ్యలో ప్రజలు ఆయనకు నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా అన్నిప్రాంతాల్లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాల వద్ద, వైఎస్సార్ కూడళ్ల వద్ద, వైకాపా కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమాలు జరిగాయి. ప్రజలకు సంక్షేమం, పేదలకు అభ్యున్నతిని సాధించి పెట్టి, జనమందరి గుండెల్లో చిరస్థాయిగా నిలచిపోయిన ఆ మహానేత సేవలను అందరూ కొనియాడారు. అపరభగీరథునిగా ఇటు జిల్లాకు, అటు రాష్ట్రానికి ఎన్నో నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రాణం పోసి, జలధారలతో రైతుల జీవనాధారాలను కాపాడారు. బడుగు బలహీనవర్గాలు, నిస్సహాయుల జీవితాలలో వెలుగులు పంచేందుకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలందించారు. ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా సకలజన సంక్షేమమే పరమావధిగా ఆయన ప్రజా పాలనను అందించారు. ముఖ్యమంత్రి కాగానే రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తూ తొలిఫైలుపై సంతకం చేసిఘనత ఒక్క వైఎస్సార్‌కే చెందుతుంది. అందుకే రాజన్నంటే అందరిలోనూ ఆత్మీయత. ఈ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని వైకాపా ముఖ్యనేతలు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆనం అరుణమ్మ, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, శాసనమండలి సభ్యులు బల్లి కల్యాణ్‌చక్రవర్తి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఇంకా ఎమ్మెల్యేలు, స్థానిక ప్రముఖులు అందరూ ఆయా ప్రాంతాల్లో రాజన్న వర్ధంతి సభలు పెట్టి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని వైకాపా జిల్లా కార్యాలయంలో మంత్రి కాకాణి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని జేమ్స్‌గార్డన్‌లో ఉన్న జగనన్న భవన్‌లో డెప్యూటి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ సారధ్యంలో మహానేత వైఎస్‌కు నివాళులర్పించారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనలతో స్థానిక కరెంటాఫీసు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, అభిమానులు వచ్చి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కోవూరులో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్ వర్ధంతి కార్యక్రమాలు పెద్దఎత్తున జరిగాయి. నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీ (విఎస్‌యు) వైస్‌చాన్సలర్ ఆచార్య జిఎం సుందరవల్లి డా.వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఇలా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వైఎస్‌ను స్మరించుకుంటూ వర్ధంతి కార్యక్రమాలు, అనేకచోట్ల సేవా కార్యక్రమాలు కూడా భారీగా నిర్వహించి నాయకులు, అభిమానులు మరపురాని మహానేత వైఎస్ పట్ల తమకున్న ఆత్మీయతాభిమానాలను చాటుకున్నారు.

### మహానేతకు..విపిఆర్ నివాళి

దివంగత మహానేత డా.వైఎస్ వర్ధంతి సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు, సేవాభూషణ్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్) కావలి నియోజకవర్గంలోని ఆనెమడుగు గ్రామంలో వైకాపా నాయకుడు భరత్‌రెడ్డి ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని సందర్శించారు. ఆ మహనీయ నేతకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రానికి సుపరిపాలన అందిస్తూ అశేష ప్రజానీకానికి ఆయన చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం విపిఆర్ స్థానిక ముఖ్య నాయకులు, అభిమానులతో కలసి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కావలి హైవే అండర్ బ్రిడ్జి వద్ద వేమిరెడ్డికి సాదర స్వాగతం పలికారు. వైకాపా నాయకులు భరత్‌రెడ్డి, నెల్లూరు కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత, నూతనంగా నిర్మించిన వైఎస్ విగ్రహాన్ని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు.

# స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్న విపిఆర్ దంపతులు

రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు, ఆధ్యాత్మిక సేవాతత్పరులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి టిటిడి ఉత్తరభారతదేశ ఆలయాల స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈనెల 4న మూడు ప్రముఖమైన దేవాలయాలను సందర్శించారు. తొలుత వేదగిరీశుని సేవించి, అనంతరం శ్రీఇరుకళలమ్మవారిని, శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.



నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై కొలువై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో వేమిరెడ్డి దంపతులు పూజలు చేశారు. ఈ సందర్భంగా విపిఆర్ దంపతులను ఆలయ ఛైర్మెన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇఓ గిరికృష్ణ పాలకమండలి సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దైవదర్శనం చేయించారు.

ఆ తర్వాత, నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఇటీవల ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్ఆర్), దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ జె.శ్రీనివాసరావు, ఇఓ



బొగ్గల మల్లికార్జునరావు, ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విపిఆర్ టిటిడి ఇఓతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రాచీనచరిత్ర కలిగిన ఇరుకళలమ్మ దేవాలంయ అభివృద్ధికి టిటిడి నుంచి నిధులిచ్చి సహకరించాలని కోరగా, అందుకు టిటిడి ఇఓ సానుకూలంగా స్పందించారు. తొలుత వేమిరెడ్డి దంపతులను ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, అమ్మవారి వద్ద పూజలు చేయించి ఆశీర్వదించారు.

అదేరోజున నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి వేమిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఇఓ వెంకట శ్రీనివాసులురెడ్డి, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు సన్నపరెడ్డి పెంచలరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు ఆలయ మర్యాదలతో వారికి ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం, ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలును అందజేశారు.





# లక్షిత కుటుంబానికి.. రూ.10 లక్షల సాయం

గతనెల 11న తిరుమలలో దైవదర్శనం కోసం అలిపిరి వద్ద నుంచి నడకదారిలో వెళ్తూ మార్గమధ్యంలో చిరుతదాడిలో మరణించిన నెల్లూరుజిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంకు చెందిన ఆరేళ్ల చిన్నారి లక్షిత తల్లితండ్రులకు తిరుమల తిరుపతి దేవస్థానం, రాష్ట్రప్రభుత్వ అటవీశాఖలు కలసి 10 లక్షల రూపాయల సాయం అందజేశాయి. టీటీడీ బోర్డు ఛైర్మెన్ కరుణాకర్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు టిటిడి-అటవీశాఖలు చెరొక 5 లక్షల రూపాయలను రక్షిత కుటుంబానికి కేటాయించాయి. ఆ సాయం చెక్కును ఈనెల 4న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి చేతులమీదుగా ఆ చిన్నారి తల్లితండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డెప్యూటి కన్జర్వేటర్ ఏ.శ్రీనివాసులు, తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి జి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# వేడుకగా 'బతుకొక ఉత్సవం' ఆవిష్కరణోత్సవం

'మాట' దీర్ఘకవితతో సాహితీ ప్రపంచంలోకి దూసుకుపోయిన ప్రముఖకవి, ఆడిటర్ చిన్ని నారాయణరావు తన తొమ్మిదవ కవితా సంపుటి 'బతుకొక ఉత్సవం' వినూత్నరీతిలో తన మనవళ్ళ పంచెకట్టు వేడుకలో ముఖ్యఅతిథులతో బాటు తన మనుమళ్ళు రామ్ శ్రీకేతన్, రామ్ శ్రీకర్‌లు పాల్గొని ఆవిష్కరించడం సభికులను ఆకట్టుకొంది. ఈ ఆవిష్కరణకు సి.పి.ఆర్ కళ్యాణ మండపం వేదికైంది.


కవి, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి చిన్ని నారాయణరావు సాహితీ ప్రయాణాన్ని, 'బతుకొక ఉత్సవం' కవితా సంపుటిని పరిచయం చేశారు. 'మాట'ను గురించి ప్రముఖ కవి శివారెడ్డి 'ఏ భాషలోనూ మాటపై ఇంతటి విస్తృతిని ఏ భాషలోనూ చూడలేదని' అన్న మాటను ఉటంకించారు. అంతేకాక కీ॥శే॥ తుర్లపాటి కుటుంబరావు, కీ॥శే॥ అద్దేపల్లి రామ్మోహన్‌రావులు సైతం చిన్ని నారాయణ రావు రాసిన 'మాట' తెలుగులో విశిష్ట దీర్ఘకవితగా చెప్పిన విషయాన్ని పేర్కొని, తెలుగు కవిత్వంలో 'మాట'పై మొదటిసారిగా రాసిన కవి నారాయణరావే అనడాన్ని గుర్తు చేశారు. 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి సభకు అధ్యక్షత వహించారు. మాజీమంత్రి, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి కవితా సంపుటిని ఆవిష్కరించారు. నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, టెర్రాలాజిక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత కోమిట్ల రెనిల్‌కుమార్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నవ మల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీ, చార్టర్డ్ అకౌంటెంట్ శ్రావణ్‌కుమార్, రచయిత చిన్ని నారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్ని నారాయణరావు మాట్లాడుతూ తనకు మార్గదర్శి, గురువర్యులు 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డికి 'బతుకొక ఉత్సవం' కవితా సంపుటిని అంకితమివ్వడం చాలా ఆనందదాయకంగా ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి బతుకు ఒక ఉత్సవం కావాలని ఆకాంక్షించారు.

నెల్లూరీయులు, వాణిజ్య ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా కవి చిన్ని నారాయణరావుకు 'లాయర్' శుభాకాంక్షలు.




## ఎన్‌బికెఆర్‌లో..
# విద్యార్థులకు మంచి భవిత
### - డైరెక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి

కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకునే విద్యార్థులకు మంచి భవిత ఉంటుందని, కళాశాలలో ఎందరో అనుభవజ్ఞులైన అధ్యాపకులున్నారని, బోధనలో నైపుణ్యం, నాణ్యతగల విద్యను అందించడంలో ఎన్‌బికెఆర్ అగ్రగామిగా ఉందని ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 4న ఎన్‌బికెఆర్‌లో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. దాదాపు 43సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న ఎన్‌బికెఆర్ విద్యారంగంలో మేటిగా నిలిచిందని, ఎన్నో జాతీయస్థాయి అవార్డులు, 'న్యాక్', ఎన్‌బిఏ వంటి అత్యుత్తమ గుర్తింపులు కూడా వచ్చాయని తెలిపారు. విద్యతో పాటు అనేక సెమినార్లు నిర్వహించడం, వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విద్యార్థుల మేధస్సును పదునుబెట్టడం వంటి కార్యక్రమాలు, మరోవైపు ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సిసి వంటి సామాజిక సేవాభావం గల సంస్థల ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దడం, ఎన్‌బికెఆర్ విద్యార్థులు సమాజంలో ఉన్నతస్థాయిలో రాణించేలా పరిపూర్ణమైన విజ్ఞానాన్ని అందివ్వడం వంటివన్నీ ఎన్‌బికెఆర్ నిత్యకృత్యాలన్నారు. రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, మాజీ ముఖ్యమంత్రి..దివంగత నేత నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తనయుడు రామ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో కళాశాల అన్నివిధాలా అభివృద్ధి చెందుతోందని, దేశ విదేశాల్లో ప్రఖ్యాతిచెందిన అనేక కంపెనీల్లో విద్యార్థులకు అద్భుతమైన ఉద్యోగావకాశాలు వచ్చేందుకు అవసరమైన శిక్షణ విద్యార్థులకు అందుబాటులో ఉందని తెలిపారు. మొదటి సంవత్సరం ఇంజనీరింగ్‌లో చేరిన విద్యార్థులు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని, తద్వారా తల్లితండ్రులకు, చదువుచెప్పిన గురువులకు, కళాశాలకు, దేశానికి మంచిపేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్‌లోని అన్ని విభాగాల అధిపతులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.



# ఆదిత్యుని చెంతకు.. మన 'ఆదిత్య'
## నింగిలోకి దూసుకెళ్లిన పిఎస్ఎల్‌వి-సి57 • విజయపథంలో సూర్యయాన్

**చంద్రయాన్ విజయస్ఫూర్తితో చేపట్టిన సూర్యయాన్ తొలిదశ విజయవంతమైంది. భారత తొలి అంతరిక్ష ఆధారిత సౌర పరిశీలన ఉపగ్రహం 'ఆదిత్య ఎల్-1'ను ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధన సంస్థ) శాస్త్రవేత్తలు అనుకున్న లక్ష్యం ప్రకారం నిర్దేశిత కక్ష్యలోకి చేరింది. శ్రీహరికోటలోని షార్ సెంటర్‌లో ఉన్న రెండవ ప్రయోగవేదిక నుంచి ఈనెల 2వ తేదీ ఉదయం 11.50 గంటలకు పిఎస్ఎల్‌వి-సి57 రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్ళింది.**

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సూర్యయాన్ ప్రారంభమైంది. పీఎస్ఎల్‌వి రాకెట్ 63 నిమిషాల పాటు ఉత్కంఠభరితమైన సుదీర్ఘమైన ప్రయాణం చేసి 1480.7 కిలోల బరువున్న 'ఆదిత్య' ఉపగ్రహాన్ని భూమికి 19,500 కిలోమీటర్ల ఎత్తులో భద్రంగా అనుకున్న కక్ష్యలో చేర్చి లక్ష్యాన్ని సాధించడంతో తొలిదశ జయప్రదమైంది. 'ఆదిత్య' 16 రోజుల పాటు ఆ కక్ష్యలోనే ఉండి ఆ తర్వాత మెల్లగా వేగం పుంజుకుని, భూమికి-సూర్యుడికి మధ్య ఉన్న ఎల్-1 అనే కేంద్రాన్ని చేరుకొని, అక్కడి నుంచే సూర్యునిపై పరిశోధనలు సాగిస్తుంది. ఎంతో క్లిష్టమైన ఈ ప్రయోగాన్ని ఇస్రో ఛైర్మెన్ సోమనాథ్ ఆధ్వర్యంలో భారత అంతరిక్ష శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

అటు చంద్రయాన్, ఇటు సూర్యయాన్..కేవలం పది రోజుల్లోనే ఈ రెండు అద్వితీయమైన ప్రయోగాలతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలందుకుంటున్నారు. భూమికి చల్లదనాన్నిచ్చే చంద్రుడి వద్దకే కాక, భగభగమండే అగ్నిపర్వతం లాంటి సూర్యుని చెంతకు కూడా వెళ్లేందుకు ఇస్రో చేపట్టిన ఈ బృహత్తర యాత్ర అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ప్రపంచంలో ఏ దేశమూ చేయలేని సాహసంతో ఆగస్టు 23న చంద్రుని దక్షిణధ్రువంపై దిగ్విజయంగా మొట్టమొదటిసారిగా చంద్రయాన్ మిషన్ అడుగిడడం భారతీయ శాస్త్రవేత్తల అసమాన ప్రతిభాపాటవాలకు నిదర్శనం కాగా, అదే స్ఫూర్తితో తాజాగా సూర్యునిపై పరిశోధనలకు అనువైన ప్రదేశం (ఎల్-1)లో అడుగిడేందుకు సెప్టెంబరు 2న సూర్యయాన్ ప్రయోగాన్ని నిర్వహించడం విశేషం. ఎంతటి బరువైన ఉపగ్రహాన్నయినా అవలీలగా తీసుకువెళ్ళే ఇస్రో నమ్మినబంటు..పీఎస్ఎల్‌వి సీరీస్‌లోని బాహుబలి రాకెట్ పీఎస్ఎల్‌వి-సి57 'ఆదిత్య' ఉపగ్రహాన్ని మోసుకుని రామబాణంలా రివ్వుమంటూ రోదసిలోకి దూసుకుపోయింది.

### 15 కోట్ల కిలోమీటర్ల ప్రయాణం :

సూర్యుడికి భూమికి మధ్య దూరం దాదాపు 15 కోట్ల కిలోమీటర్లకు పైగానే ఉంటుంది. సూర్యగోళమంటే.. కణకణ మండే అగ్నిగోళం. అక్కడ 10లక్ష డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రత ఉంటుంది. అందువల్ల అక్కడికి నూరోవంతు దూరం.. అంటే 15లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. అక్కడికి మన ఉపగ్రహం చేరుకోవాలంటే 125 రోజులు పడుతుంది. ఆ తర్వాత రోదసిలోనే సురక్షితమైన ఆ కక్ష్యలో తిరుగుతూ సూర్యుడిపై ఆదిత్య ఎల్-1 ఉపగ్రహం పరిశోధనలకు ఉపక్రమించనుండడం ఒక అద్భుతం. సూర్యుడి రహస్యాలను తెలుసుకునేందుకు, సౌరతుఫానులు వచ్చినప్పుడు ఎగిసిపడే రేణువుల గురించి శోధించేందుకు, కాంతిమండలం.. వర్ణమండలాలకి సంబంధించిన పూర్తిస్థాయి అధ్యయనాలు చేసేందుకు, తద్వారా ఇప్పటికే అంతరిక్షంలోకి పంపిన సమాచార వ్యవస్థలకి సూర్యతాపం నుంచి ఎలాంటి ప్రమాదం లేకుండా రక్షించుకునేందుకు ఈ ప్రయోగం ఎంతగానో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దాదాపు 460 కోట్ల ఏళ్ళ క్రితమే అంతరిక్షంలో ఆవిర్భవించిన సూర్యమండలం గురించిన కీలకమైన విషయాలను కనుగొనాలన్నదే సూర్యయాన్ లక్ష్యం. సురక్షిత కక్ష్యకు చేరుకుని, సుదీర్ఘకాలం ప్రయోగాలు చేసేలా ఆదిత్య-ఎల్1ను రూపుదిద్దడం మన శాస్త్రవేత్తల అసమాన ప్రజ్ఞాపాటవాలకు నిలువెత్తు నిదర్శనం. ఈ ప్రయోగం తొలిదశ విజయవంతం కావడంతో షార్ శాస్త్రవేత్తల్లోనే కాక దేశ ప్రజల్లోనూ, ప్రపంచవ్యాప్తంగా కూడా ఆనందం వెల్లువెత్తుతోంది.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## వైఎస్సార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో
# ఉచిత వైద్య శిబిరం



తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం, మల్లాం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో డాక్టర్ వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివంగత నేత డా. వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 2న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. గూడూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు, డాక్టర్ వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ బత్తిని విజయకుమార్ ఆధ్వర్యంలో నెల్లూరు ఫిజిషియన్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, వైద్య నిపుణులు శ్రీనివాసులు, అంశాల బాషా, వైద్య సిబ్బందితో పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించారు. ఈ సందర్భంగా బత్తిని విజయకుమార్ మాట్లాడుతూ వై.యస్.రాజశేఖరరెడ్డి ఆయన ప్రవేశపెట్టిన పథకాలతో పేదల దైవంగా మారారని, ఆయన ఆశయాలు సాధించేలా ఇప్పుడు ఆయన కుమారుడు ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారన్నారు. వైసిపి నాయకులు బాబురెడ్డి, శ్రీహర్ష, దగ్గోలు సురేంద్రబాబు, మునీ మారల్, మాజీ జడ్పీటీసీ వంకి రమణయ్య, రవి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## మినీ గురుకులంలో ఉపాధ్యాయుల దినోత్సవం



గూడూరు రెండవ పట్టణంలోని ఏపీటీడబ్ల్యూఆర్ మినీ గురుకులంలో శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు, సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డి.ఆర్.యు.సి.సి మెంబర్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) దాతృత్వంతో ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. గురుకులంలోని ఉపాధ్యాయులకు మ్యూజికల్‌ఛైర్, కబడ్డి, త్రో బాల్ ఆటలు నిర్వహించి బహుమతులందించారు.

## నేత్రపర్వంగా కృష్ణాష్టమి వేడుకలు



గూడూరు పట్టణంలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో ఈ నెల 4వ తేదీ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గోపూజ, శోభాయాత్ర, విద్యార్థుల నృత్యాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్.మురళీరెడ్డి, బ్రజేంద్రరెడ్డి, మురళీకృష్ణ, కడివేటి రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఐసి 67వ వార్షికోత్సవం



ఇన్సూరెన్స్ రంగంలో అత్యంత ఎక్కువగా క్లైమ్ని క్లియర్ చేస్తున్న సంస్థగా ఎల్ఐసి భారత్‌లో అగ్రస్థానంలో ఉందని తిరుపతి జిల్లా గూడూరు ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ మధుబాబు తెలిపారు. ఎందరో మేధావుల ఆలోచన ఫలితంగా ఎల్ఐసి రూపొందిందని, అటువంటి ఎల్ఐసిని ప్రజలు ఆదరించాలని, సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. లంచానికి తావులేని ఏకైక సంస్థ ఎల్ఐసి మాత్రమేనని స్పష్టం చేశారు. ఇటీవల గూడూరులోని ఎల్ఐసి బ్రాంచ్‌లో 67వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు స్వీట్లు పంచిపెట్టారు. అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ జనార్ధన్ మాట్లాడుతూ 5004 కార్యాలయాలు, లక్షా నాలుగువేల మంది ఉద్యోగులు, 13 లక్షల 32వేల మంది ఏజెంట్లతో ఎల్ఐసి తన సేవలను అందిస్తోందని చెప్పారు. పలువురు ప్రముఖులు, ఎల్ఐసి అధికారులు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం
### ఆర్డీవో కిరణ్‌కుమార్



విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించడం అభినందనీయమని ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ది యంగ్ గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు డిఎస్పీ సూర్యనారాయణరెడ్డితో కలిసి సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతాయని చెప్పారు. ప్రతినిధులు చేవూరు విజయమోహన్‌రెడ్డి, జమాలుల్లా, కోట రామారావు, శ్రీహరి, చెంచురామయ్య, డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ రియాజ్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సరుకుల పంపిణీ



గూడూరులోని డిఎన్ఆర్ కమ్యూనిటీహాల్‌లో సిద్దారెడ్డి జనార్ధన్‌రెడ్డి దివ్యాంగుల చేయూత పథకంలో భాగంగా ఈ నెల 3వ తేదీ సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు సరుకులను పంపిణీ చేశారు. ప్రతినిధులు బత్తల రవీందర్‌రెడ్డి, శారదమ్మ, సనత్‌కుమార్‌రెడ్డి, బ్రజేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సందడిగా కృష్ణాష్టమి



శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఈనెల 6న జిల్లావ్యాప్తంగా ఉన్న శ్రీకృష్ణ భగవానుని ఆలయాల్లో విశేషపూజలు జరిగాయి. స్వామి వారికి కన్నులపండువగా అలంకరణలు చేశారు. పలుప్రాంతాల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు-గోపికల వేషధారణలతో భక్తులను ఆకట్టుకున్నారు.

### ఇస్కాన్ మందిరంలో :

ఇస్కాన్ మందిరంలో కొలువైవున్న శ్రీకృష్ణపర మాత్మను, ఇతర దేవతామూర్తులను పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఇస్కాన్ మందిరం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా అనేకమంది చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు శుకదేవస్వామి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. గురువారం పూజలు, భక్తిగీతాలాపనలు, భజనలు నిర్వహించారు.

### రంగనాథస్వామి దేవాలయంలో :

నెల్లూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో కొలువైవున్న శ్రీ రంగనాథస్వామికి, శ్రీకృష్ణస్వామికి ఈనెల 7న ప్రత్యేకపూజలు, తిరుమంజనం తదితర సేవలు చేశారు. ఆ తర్వాత గోపురోత్సవం, సాయంత్రం కోలాహలంగా ఉట్టి మహోత్సవం, పేట ఉత్సవం నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ శివకుమార్ ఆచారి, ఇఓ వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు.

### శ్రీకృష్ణ యోగమందిరంలో :

నగరంలోని సుజాతమ్మ కాలనీలో ఉన్న శ్రీకృష్ణ యోగ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. మూలవర్లకు, ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం, పుష్పాభిషేకం జరిగాయి. ఆలయ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ పూజలు చేపట్టారు. సాయంత్రం కోలాటం, పల్లకిసేవ చేపట్టారు.

# నరసింహస్వామికి.. మాగుంట శీనయ్య పూజలు



నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై ఉన్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఇటీవల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నూతన ధ్వజస్తంభానికి ఈనెల 3న మహా సంప్రోక్షణ కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్న నేపథ్యంలో ఆయన నరసింహకొండకు వచ్చి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ధ్వజస్తంభ సంప్రోక్షణల్లో భాగంగా ఆలయ అర్చకులు కుంభారాధనతో పాటు విశేష హోమాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి పూజాకార్యక్రమాలను తిలకించారు. ఆలయ ఛైర్మెన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇఓ గిరికృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

# వైసీపీ, బీజేపీలపై.. సీపీఎం 'సమరభేరి'




వైసీపీ, బీజేపీలపై సీపీఎం సమరభేరి మోగించింది. జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి కేంద్రం, రాష్ట్రంలలో అధికారంలో ఉన్న ఆ పార్టీల ప్రజావ్యతిరేక విధానాలను దుయ్యబట్టింది. నెల్లూరు నగరంలోనూ నిరసనలు వెల్లువెత్తాయి. స్థానిక విఆర్ కళాశాల వద్ద నుంచి కలెక్టరేట్ వరకు పెద్దఎత్తున ప్రదర్శన చేపట్టారు. పెట్రోలు, డీజల్ ధరలు పెరగడంతో దేశంలో నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయని, సామాన్యులు బతకలేకపోతున్నారని, దేశమంతా నిరుద్యోగం తాండవిస్తోందని అయినా కేంద్రం పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ దుమ్మెత్తిపోశారు. అదనపు విద్యుత్ చార్జీల భారంతో రాష్ట్ర ప్రజలు అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు ఎం. మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, మస్తాన్‌బీ, తిరుపాలు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఛత్రపతి శంభాజీ వీరచరిత్రకు నిలువుటద్దం.. 'శ్రీ శంభు భారతము'

ఆయన కలం పేరు 'సింహరాజ్'. అసలు పేరు 'శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాదరావు'. ఉండేది నెల్లూరులో..వృత్తిరీత్యా వైద్యునిగా పనిచేసేది జయభారత్ ఆసుపత్రిలో. ఆయన ప్రవృత్తి రచనా వ్యాసంగం. ఆయన రచించిన పద్యకావ్యం పేరే 'శ్రీ శంభు చరిత్రము'. ఛత్రపతి శంభాజీ వీరచరిత్రను పద్యప్రబంధంగా అక్షరబద్ధం చేశారాయన. 2130 పద్యాలతో, 480 పేజీలతో ముద్రితమైన ఈ పద్య ప్రబంధం రాశిలోనే కాదు, వాసిలో కూడా బృహత్తరమైనదే. వివిధ చ్ఛందోగీతులు సరళ సుందరంగానూ, మహోజ్వలంగానూ నాట్యమాడినట్లుంటాయి ఈ రచనలో. 1943లో గడియారము వేంకటశేషశాస్త్రి సనాతన ధర్మ ప్రబోధకంగా ఛత్రపతి శివాజీ చరిత్రను 'శివ భారతము' అనే పేరుతో రచించారు. అది సుప్రసిద్ధమైనది. దానిచే ప్రభావితుడైన సింహరాజ్ శివాజీ పెద్దకొడుకు (1657-1689) శంభాజీ చరిత్రను "శ్రీ శంభు భారతము" అనే పేరుతో అద్వితీయ ప్రబంధంగా నిర్మించారు. శివభారతము వలె 'శంభు భారతము' కూడా పాఠక లోకంలో ప్రసిద్ధి పొందుతుందని ఆశించవచ్చు.






**శ్రీ శంభు భారతము**
రచయిత:
శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాదరావు
పేజీలు : 480 వెల. 400/-
ప్రతులకు:
'సింహరాజ్'
బాలాజీనగర్, నెల్లూరు - 524 002.
సెల్ : 7995949680.

శంభాజీ మహరాజ్ మహావీరుడు. మరాఠా సామ్రాజ్యాన్ని తొమ్మిది సంవత్సరాలపాటు (1681-1689) పాలించిన రెండవ ఛత్రపతి. చిన్నప్పటి నుండి మాతామహి శివాజీ తల్లి జిజియాబాయి పెంపకంలో హైందవమత ప్రబోధ గాథలు విని దేశభక్తిపరుడయ్యాడు. అందులోనూ విద్వత్కవి. కర్షక పక్షపాతి. పదేండ్ల వయసులోనే తన తండ్రితో పాటు ఆగ్రాలో ఔరంగజేబు బందీగా ఉండి, తప్పించుకున్నాడు. సమర్ధ రామదాసు వీరికి ధర్మప్రబోధకుడు. చివరకు మాయోపాయంతో ఔరంగజేబు చేతికి చిక్కిన శంభాజీని మతం మారాలంటూ మొఘలు భటులు ఆదేశించారు. లొంగకపోయేసరికి అత్యంత క్రూరంగా హతమార్చారు. నాలుకలను చీల్చారు, కనులు పొడిపించారు, చర్మాన్ని ఇత్తడి పులిగోళ్ళతో చీల్పించారు. కాల్చేతులు నరికించారు. అయినా ఆ ధర్మవీరుడు నిరంతరం జగదంబనే స్మరించుకుంటూ ప్రాణాలొదిలారే తప్ప మతం మారలేదు.

ఆ కోపంలో ఔరంగజేబు శంభాజీని, అతడి మిత్రుడు కవికులశుడిని హింసించి తలలు నరికించి వారి శరీరాలను ముక్కలు చేసి భీమా నదిలో పారవేయించాడు.

***'నెత్తురు కారు గాయముల నేకములున్నను కాయమెల్లెడన్***
***మొత్తుచు కర్రలన్ కటిక మోగలు బంటులు మేనికండలన్***
***తుత్తుమురున్నొనర్చిన-కనుల్ పెకలించిన- నాల్క చెండినన్***
***చిత్తము నందు శంభునకు చింత స్వరాజ్య, స్వధర్మ రక్షణే!..***

అంటూ కవి సింహరాజ్ ఆ ఘట్టాలను ఉన్నదున్నట్లుగా వర్ణించి కంటనీరు తెప్పించారు. మతం మారడం ధర్మం కాదంటాడు శంభాజీ. అన్ని చిత్రహింసలు పాలైనా ధర్మాన్ని వదలకుండటమే 'ధర్మవీర' లక్షణం. శంభాజీ ఆత్మార్పణతో నాటి ప్రజల్లో హిందూ ధర్మ సంరక్షణాకాంక్ష బలపడింది. మరణించినా సరే, మాతృమూర్తిని, మాతృభూమిని, అత్యంత విశిష్టమైన హిందూ ధర్మాన్ని వదలకూడదని నిశ్చయించుకున్నారు. నదిలో పడిన ఆ మాంస ఖండాలను ఏరి తెచ్చి భీమానది ఒడ్డున ప్రజలు ఒక స్మారక చిహ్నాన్ని కూడా నిర్మించారు. అంతటి ఘన వీరచరితను హృద్య పద్యాత్మకంగా రచించిన కవి సింహరాజ్ ఎంతైనా అభినందనీయులు.

మన పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ వీరగాథ గ్రంథావిష్కరణ వివరాలు తెలుసుకొని, ఇలాంటి సనాతన ధర్మ ప్రచారక, చారిత్రక మహాకావ్యాలు అన్ని భాషలలో కూడా చాలా అవసరమంటూ చెప్పి సింహరాజ్‌ని కొనియాడారు. 'ఆర్ష ధర్మరక్షక', 'స్వరాజ్యవర్ధన', 'ధర్మవీర', "మహావీర' ఛత్రపతి శ్రీ శంభాజీ భోసలే మహారాజె చరిత్ర 'శ్రీ శంభు భారతము' దేశభక్తి, ధర్మప్రబోధ గావించి ప్రజలను మరింత దేశ భక్తులుగా, ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దుతుందని ఆశిద్దాం.



- మెట్టు రామచంద్రప్రసాద్
సెల్ : 93463 23609

## టూకీగా...



### రైతులకు సబ్సిడీ మినుములు

వరికుంటపాడు మండలపరిధిలోని రైతులు మినుము పంటను సాగుచేసుకునేందుకు రైతుభరోసా కేంద్రాల్లో సబ్సిడీ మినుములు అందజేస్తున్నామని వ్యవసాయాధికారి రవికుమార్ తెలిపారు ఈ మండలంలో 1300 ఎకరాల్లో మినుము సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారని, 30శాతం సబ్సిడీపై ఇస్తామని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### మనుబోలులో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని, నడవడిక మార్చుకుని బుద్ధిగా బతకాలని మనుబోలు ఎస్సై అజయ్‌బాబు ఈనెల 3న రౌడీషీటర్లకు క్లాస్ పీకారు. నేరాలకు పాల్పడితే సహించేది లేదని, పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించారు. మంచిగా ఉంటే రౌడీషీట్ తీసేసేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతామని చెప్పారు.

### కావలిలో ఎన్‌సిసి క్యాడెట్లకు రక్తగ్రూపు పరీక్షలు

కావలి మునిసిపాలిటీలోని పాతవూరులో 8వ వార్డు ఉన్నతపాఠశాలలో ఇటీవల ఎన్‌సిసి క్యాడెట్లకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు చేసి గుర్తింపు కార్డులిచ్చారు. ఎన్‌సిసి కేర్ టేకర్ కెవి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రాఘవేంద్రరావు, రక్తకేంద్రం సిబ్బంది పద్మావతి, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

### రావిపాడులో పశువైద్యుల సూచనలు

వింజమూరు మండలంలోని రావిపాడులో ఇటీవల పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పశువిజ్ఞానంపై రైతులకు తగు సూచనలిచ్చారు. మూగజీవాల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలోని పశువులుకు ఉచితంగా గొంతువాపు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. పశుసహాయకులు మహేష్, హజరత్, కృష్ణ, భార్గవ్ పాల్గొన్నారు.

### సీతారామపురంలో 'ఫ్లోరోసిస్'పై అవగాహన

మండల కేంద్రమైన సీతారామపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి దివ్య ఆధ్వర్యంలో స్థానికులకు ఫ్లోరోసిస్ వ్యాధిపై వైద్యసిబ్బంది అవగాహన కలిగించారు. ఫ్లోరోసిస్‌ను ముందుగానే ఎలా గుర్తించాలో చెప్పారు. చిన్నారుల దంతాలకు వచ్చే గారను బట్టి వ్యాధిని ప్రాథమికంగా గుర్తించవచ్చన్నారు. ఆ వ్యాధి పట్ల గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.

### ముదివర్తిలో 'ఈ-పంట' నమోదు పరిశీలన

విడవలూరు మండలం ముదివర్తిలో 'ఈ-పంట' నమోదును జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.సుధాకర్‌రాజు ఇటీవల పరిశీలించారు. నమోదు చేసిన వరిపొలాలను చూసొచ్చారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలు అందాలంటే రైతులు ఈ-పంట నమోదును తప్పనిసరిగా చేసుకోవాలని చెప్పారు. వ్యవసాయ అధికారులు నర్సోజీ, సుజాత, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

### పంగిలిలో 'నా దేశం-నా మట్టి'

రాపూరు మండలం పంగిలి గ్రామంలో ఈనెల4న బీజేపీ ఆధ్వర్యంలో 'నా దేశం-నా మట్టి' కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్ళి దేశభక్తిని ప్రబోధిస్తూ మట్టిని సేకరించారు. ఆ మట్టిని ఢిల్లీలోని 'కర్తవ్యపథం' ఉద్యానవనానికి పంపుతామన్నారు. మండల బీజేపీ నాయకుడు డి.పెంచలయ్య, సామర్ల జయసింహా, వెలికంటి ప్రదీప్‌రెడ్డి, వెంకటాద్రి పాల్గొన్నారు.

### కొత్తవంగల్లులో పోషకాహార వారోత్సవాలు

కొడవలూరు మండలంలోని కొత్తవంగల్లు అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల పోషకాహార వారోత్సవాలు జరిగాయి. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొని అంగన్‌వాడీ పిల్లలు, గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలన్నారు. సుజాత, సుప్రజ, కామేశ్వరి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### ఇందుకూరుపేటలో డిసిఓ తనిఖీలు

ఇందుకూరుపేట పంచాయతీ కార్యాలయాన్ని, సచివాలయాన్ని ఈనెల4న జిల్లా సహకారశాఖ అధికారిణి (డిసిఓ) సుధాభారతి ఆకస్మిక తనిఖీలు చేసి, సిబ్బంది పనితీరును ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి ఉద్యోగులకు సూచనలిచ్చారు.



నెల్లూరుజిల్లా పిడతాపోలూరు వాస్తవ్యులు, హైదరాబాద్ నివాసి 'అర్బన్‌రైజ్' సంస్థ డైరెక్టర్ పోతిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి - మాలినల కుమార్తె **తేజశ్విని - ప్రద్యూన్‌**ల పరిణయం సెప్టెంబర్ 1వ తేదీ హైదరాబాదులో జరిగింది. తేజశ్విని - ప్రద్యూన్‌లకి 'లాయర్' శుభాకాంక్షలు.








విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ & టెక్నాలజీ ప్రొఫెసర్ & హెడ్ డా. చింతా రవీంద్రారెడ్డి - సుమలతల కుమార్తె **శ్వేత - కృష్ణచైతన్య**ల పెళ్లి ఆగస్టు 31వ తేదీ నెల్లూరులో జరిగింది. కొత్త జంటకి 'లాయర్' శుభదీవెనెలు.



నెల్లూరు వాస్తవ్యులు, మద్రాసు నివాసి దేగా శ్రీనివాసులరెడ్డి - డా. సునీతల (లేట్ దేగా రామగోపాల్‌రెడ్డి మనుమరాలు) కుమార్తె **డా. సాయి కావ్య - డా. రామేశ్వర్‌**ల కళ్యాణం సెప్టెంబర్ 3వ తేదీ చెన్నైలో జరిగింది. నవదంపతులకి 'లాయర్' శుభాశీస్సులు.



'శాంత బయోటెక్నిక్స్' వ్యవస్థాపకులు కోడూరు వరప్రసాద్‌రెడ్డి తమ్ముడు లేట్ కోడూరు సత్యనారాయణరెడ్డి - లక్ష్మిల కుమారుడు **బాల శశిధర్‌రెడ్డి - భావన**ల వివాహం ఆగస్టు 31వ తేదీ నెల్లూరులో జరిగింది. నూతన వధూవరులకి 'లాయర్' ఆశీస్సులు.



వింజమూరు వాస్తవ్యులు గణపం శ్రీనివాసులురెడ్డి - అరుణల రెండవ కుమారుడు **బాలకృష్ణారెడ్డి - మౌనిక**ల కల్యాణం సెప్టెంబర్ 1వ తేదీ వింజమూరులోని శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో జరిగింది. నవ జంటకి 'లాయర్' శుభాభినందనలు.

# ఇండియా.. ఇక భారత్

(మొదటి పేజీ తరువాయి)

కూటమిలోని అన్ని పార్టీలూ ఆరోపిస్తున్నాయి. అయితే ఖచ్చితంగా ఇది రాత్రికి రాత్రి తీసుకున్న నిర్ణయంగా అనిపించడం లేదు. ఆర్.ఎస్.ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇటీవల ఇండియాను భారత్ అని పిలవాలని పిలుపునిచ్చారు. ఈ ప్రతిపాదన చాలా రోజులుగా ఉందని కూడా కొందరు కేంద్ర ప్రముఖులు చెప్తున్నారు. అయితే ఇప్పుడు జి :20 సదస్సు జరిగే సందర్భాన్ని సరైన సమయంగా భావించి ఈ సమచారాన్ని వార్తల లోకి తీసుకొచ్చారని అంటున్నారు. ప్రపంచ స్థాయి ప్రముఖులనేక మంది ఈ సదస్సులో పాల్గొంటారు కాబట్టి ఈ మార్పు ప్రపంచమంతా ఒక్క సారిగా గుర్తించే అవకాశం వుందన్నది వారి వాదన.

## పురాణకాలం నుంచీ 'భారత్'

ఇప్పుడు కాదు, వేలాదిఏళ్ల నాటి వేదకాలం నుంచి, పురాణ కాలం నుంచి కూడా మనది భరత భూమిగానే ప్రసిద్ధి. పురాణ కాలంలో పాండవులు-కౌరవుల పూర్వీకులైన హస్తినాపురం మహారాజు దుష్యంతుడు. ఆయన భార్య శకుంతల. వీరి కుమారుడే భరతుడు. భరతరాజ్యాన్ని స్థాపించింది భరతుడే కనుక మనదేశానికి భారత్ అని పేరు వచ్చిందని మహా భారతం ద్వారా అర్ధమవుతోంది. ఇది భరతుడు పుట్టిన నేల. భరత సామ్రాజ్యాన్ని పాదుకొల్పిన భరతుడి పేరుమీద భరతభూమి అనే పేరు వచ్చిందని చరిత్ర కారులు కూడా భావిస్తున్నారు.

**'ఉత్తరం యత్సముద్రస్య హిమాద్రేశ్చైవ దక్షిణాం వర్షం తద్భారతం నామ భారతీ యత్ర సంతతి:'..**

అని మన ప్రాచీన శాస్త్రాలు చెప్తున్నాయి. అంటే, ఉత్తరాన సముద్రం, దక్షిణాన హిమాలయాలు కలిగి ఉన్న భూమి భరతభూమి అని ఆనాటి పురాతన గ్రంథాల్లో ఉంది.

'సింధు' అనే సంస్కృత పదాన్ని ఇంగ్లీష్‌లో 'ఇండస్' అనేవారు. సింధు నాగరికత విలసిల్లుతున్న ఆ కాలంలో ఇండస్‌లో ఉన్నవాళ్ళను అప్పటి వలసపాలకులైన బ్రిటీషోళ్ళు ఇండియన్స్ అనేవారు, అదే క్రమంలో భారతదేశాన్ని వారు ఇండియా అని పిలిచేవారు. భారత్ అనడం కంటే ఇండియా అనడమే వాళ్లకి సులభమనిపించేది. దాంతో 'ఇండియా' పేరు వాడుకలోకి వచ్చిందంటారు. అప్పట్లో ప్రజలు సింధూ నది పరీవాహక ప్రాంతంలో నివసించేవారు కనుక వారంతా హిందువులని, ఈ ప్రాంతం హిందూస్థాన్ అని కూడా కొందరు అనేవారు. గ్రీకులు సింధూ అనే పదాన్ని 'హిందూ' అనేవారు. దాంతో హిందూ, హిందూస్థాన్ పదాలు బాగా వ్యాప్తిలోకి వచ్చాయని కొన్ని పరిశోధనలు చెప్తున్నాయి. హిందూస్థాన్ అన్నది పర్షియన్ పదం.

## వివాహ వ్యవస్థలో కూడా

ఎంతో పురాతనమైన హిందూ వ్యవస్థ నేటికీ మనదేశంలో కొనసాగుతూనే ఉంది. పెళ్ళిళ్లు చేసుకునేటప్పుడు మన ప్రాచీన మహర్షుల ద్వారా మనకు వారసత్వంగా వచ్చిన 'మహా సంకల్పం' పఠించడం ఆచారం. కన్యాదాత కన్యాదానానికి అంగీకారం తెలుపుతున్న సందర్భంలో వేదమంత్రాలతో కూడిన ఆ మహా సంకల్పాన్ని వేదపండితులు పఠిస్తారు. అందులో ముఖ్యంగా 'జంబూ ద్వీపే.. భరతవర్షే.. భరతఖండే' అని మంత్రం చదువుతారు. భరతవర్షే అంటే భరతభూమి అని అర్ధం. ఇలా ప్రాచీనకాలం నుంచి మనదేశానికి భరతభూమి అని పేరుండడం అందరికీ తెలిసిందే. 'భ'.. అంటే తేజస్సు అని, 'రత' అంటే కలిగివుండేవారని అర్ధాలు. భరతభూమిలో ఉన్న ప్రజలు అంతటి తేజస్సు అంటే దైవజ్ఞానం. అంతటి స్ఫూర్తి-కీర్తి కలిగివున్న పేరు.. 'భరత' భూమి అనేది.

## 'భారత్'లో ఏముందంటే!...



ఇండియాని మార్చి భారత్ అని పేరు పెట్టాలనుకోవడం ఎందుకు?..అసలు, 'భారత్' అనే పేరులో ఏముందంటూ విమర్శకుల ప్రస్తావనలు చూసి ఎంతోమంది ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు స్పందిస్తున్నారు. ప్రఖ్యాత సద్గురువు జగ్గీ వాసుదేవ్ ఇటీవల ఒక కార్యక్రమంలో 'భారత్' విశిష్టత ఎంతటిదో అద్భుతంగా వివరించారు కూడా. అనేకమంది సామాన్య ప్రజలకు కూడా 'భారత్' నచ్చుతోంది. ఎందుకంటే, 'భారత్' అనగానే ప్రజల గుండెల్లో దేశభక్తి ఉప్పొంగుతుంది. భారత్ అనగానే అందరి హృదయాల్లో ఆత్మీయత ధ్వనిస్తుంది. భారత్‌లో శాంతి ఉంది-సహనం ఉంది. 'భారత్'లో ఆత్మీయత ఉంది, మానవీయత ఉంది. ధీరత్వం ఉంది.. దైవత్వం ఉంది. అన్నిటికీ మించి భారతీయత ఉంది. 'భారతదేశం నా మాతృభూమి' అని గర్వంగా చెప్పుకోవడంలో ఎంతో హుందాతనం ఉంది. అందుకే జాతీయగీతంలో కూడా 'జయహే భారత భాగ్యవిధాతా' అని, జాతీయ ప్రతిజ్ఞలో 'భారత్ మేరా దేశ్ హై' అని పేర్కొన్నారు. మనదేశంలో అత్యున్నత గౌరవ పురస్కారం పేరు కూడా 'భారత రత్న'యే కదా! ఇంతకన్నా ఏ పేరులోనైనా గొప్పదనం ఇంకేం ఉంటుందీ!. అని భారత్ పేరులోని విశిష్టత గురించి వారు వివరిస్తున్నారు.

## పేరులో చాలా ఉంది :

పేరులో ఏముందంటే ఎలా?.. పేరులోనే అంతా ఉంది. మనిషికే కాదు, చెట్టుకీ పుట్టకీ, పశువులు పక్షులకి, ఒక్క మాటలో చెప్పాలంటే సకల జీవరాశులకీ పేరుంటుంది. అవి ఒకదానికొకటి పేరుపెట్టి పిలుచుకోకపోయినా వాటిని మనం పేరు పెట్టి పిలుస్తుంటాం. కనుక, పేరులో ఏముంది గొప్ప అనుకోవడం సముచితం కాదనే అభిప్రాయాలూ ఉన్నాయి. వాస్తవానికి ఎవరికైనా పేరు పెట్టుకోవడానికి శాస్త్రోక్తంగా పెద్ద తతంగమే ఉంది. పసిబిడ్డగా ఉన్నప్పుడే 'నామకరణం' చేస్తారు. పేరు పెట్టడానికి మంచిరోజు, శుభముహూర్తం అన్నీ చూసి, పుట్టిన స్థలం..సమయం, తల్లితండ్రుల పేర్లు అన్నీ తెలుసుకుని, జాతకం చూసి మరీ పేరు పెడతారు. నేటికీ మనదేశంలో కోట్లాది మంది గృహస్తులు తమ పిల్లలకు పేర్లు పెట్టాలనుకున్నప్పుడు సంప్రదాయబద్ధమైన ఈ తంతు నిర్వహిస్తూనే ఉంటారు. ఒక్కరికి పేరు పెట్టడానికే అన్ని కార్యక్రమాలు చేయాల్సి ఉంటే, కోట్లాదిమంది ప్రజలున్న ఒక పెద్ద దేశానికి.. అందులోనూ వివిధ మతాలు, అనేకరకాల కులాలు, జాతులు, ఎంతో విలక్షణమైన సంస్కృతి సంప్రదాయాలు కలగలసి, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన మన దేశానికి, ప్రపంచంలోనే అతిపెద్దదైన మన ప్రజాస్వామ్య దేశానికి.. ఇంతకాలానికి కొత్తగా పేరు మార్చి పెట్టాలనుకోవడం చిన్న విషయమేమీ కాదు. విమర్శలెన్నున్నా పేరుమార్చడానికి తగ్గ ఆ కసరత్తు చేయడానికే కేంద్రప్రభుత్వం సంకల్పించినట్లుంది.

ఏది ఏమైనా ఈ ప్రతిపాదనని అధిక శాతం భారతీయులు స్వాగతిస్తున్నారు. తాము భారతీయులమే కానీ ఇండియన్స్‌మి కాదని గర్వంగా చెప్పుకుంటామని అంటున్నారు. ఇకపై మనదేశాన్ని భారత్ అనే పిలుద్దాం అని నినదిస్తున్నారు. వ్యూహం ఏదైనా ఆలోచన మంచిదే. 'భారత్ ' అన్న పేరుతో మన దేశం భావితరాల భరత జాతి గర్వించేలా ఎదుగుతుందన్న ఆనందం వందకోట్లకు పైగా భారతీయుల నుండి వ్యక్తమవుతోందనడంలో సందేహం లేదు.

**'మేరా భారత్ మహాన్' – 'జై భారత్..!'**

## కార్మికుల సమస్యలపై..
# 14న బహిరంగ సభ

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈనెల 14న నెల్లూరులోని ముత్తుకూరు రోడ్డు కూడలిలో భారీ బహిరంగసభ నిర్వహిస్తామని కార్మిక సంఘం నగర కార్యదర్శి కె.శ్రీనివాసులు, నాయకులు అల్లాడి గోపాల్, సత్యనారాయణ తెలిపారు. కార్మికుల సంక్షేమబోర్డు నుంచి కార్మికులకు రావాల్సిన రాయితీలు ఇప్పటికీ అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు సభ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ సభ ద్వారా తమకు రావాల్సిన రాయితీలివ్వాలని డిమాండ్ చేస్తామన్నారు.

# రైతాంగాన్ని ఆదుకోవాలి
## - బీజేపీ నాయకుడు మిడతల



కండలేరు డ్యామ్ ఎడమ కాలువ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన 7కోట్ల విద్యుత్ బకాయిలు చెల్లించి, విద్యుత్ సౌకర్యం కలిగించి రైతాంగానికి నీరందించాలని బీజేపీ నాయకుడు, 'నమామి గంగే' రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌ను ఒక వినతి పత్రంలో కోరారు. కండలేరు హై లెవెల్ స్లూయిస్ ద్వారా జిల్లాలోని పొదలకూరు, నెల్లూరు రూరల్, వెంకటాచలం మండలంలో 20,700 ఎకరాలకు నీరు అందించాల్సి ఉందని, డ్యామ్‌లో 29 టీఎంసీల కంటే నీరు తక్కువ ఉన్నప్పుడు రైతులకు హై లెవెల్స్ స్లూయిస్ ద్వారా నీరందించాలని, ఇప్పుడు కేవలం 14 టీఎంసీలే ఉన్నాయని, అందువల్ల ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కావలిలో.. ఎన్వి రమణయ్య స్మారక సంచిక
# 'రమణీయం' ఆవిష్కరణ

కావలిలోని జవహర్‌భారతి డిగ్రీ కాలేజ్ మాజీ కరెస్పాండెంట్ దివంగత ఎన్వి రమణయ్య స్మారకంగా 'రమణీయం' పేరుతో ముద్రించిన ప్రత్యేక సంచికను కావలిలో ఈనెల 3న విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వోదయకు రమణయ్య చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ప్రిన్సిపాల్ డా. ఆర్. మల్యాద్రి అధ్యక్షత వహించిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. ఆర్ మాల్యాద్రి మాట్లాడుతూ, రమణయ్య నిరాడంబరుడని, సామాజిక సేవంటే ఆయనకెంతో ఇష్టమని, సామాజిక చైతన్యానికి ఆయన ఎంతగానో కృషి చేశారని అన్నారు. సాహితీ మిత్రులు, విజయవాడ సొసైటీ ఫర్ సోషల్ ఛేంజ్-కావలి సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ రామ్ సెంటర్ ఛైర్మెన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, విజయవాడ శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు చాకలకొండ శారద, జేబీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ పోతు రాజు, కల్యాణరావు, హెచ్ఎస్‌వికె రంగారావు, చెంచయ్య, తాతిరెడ్డి, రమణయ్య కుమార్తె రేణుక, సాహిత్యాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# 'జమిలి' కోసం మోడీ... మోడీ కోసం జమిలి...!



జమిలి ఎన్నికలు. దేశవ్యాప్తంగా ఇప్పుడు మారుమోగిపోతున్న ఓ రాజకీయ చిట్కా ఇది. ఇది కొత్తదీ కాదు, ప్రపంచంలో ఎక్కడా లేనిదీ కాదు.

కాకపోతే, దీనిని ప్రచారంలోకి తీసుకురావడానికి నరేంద్ర మోడీ ఎంచుకున్న విధానం, టైమింగ్, హడావుడితో కేంద్రప్రభుత్వ పెద్దలకు ఏమైనా రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయా అనే సందేహాలు, అనుమానాలు దేశవ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి.

2014, 2019లో నరేంద్ర మోడీ సునాయసంగా కేంద్ర ప్రభుత్వ సారథ్యం సాధించగలిగారు. దేశంలో ఉన్న యాభైకిపైగా రాజకీయపక్షాలు ఉమ్మడిగా బీజేపీని సవాలుచేసే పరిస్థితి లేకపోవడంతో, నరేంద్ర మోడీ పని... 'మూడు డ్రెస్సులు - ఆరు రోడ్ షోలు'గా సాగిపోయింది.

భీకరమైన రెండు ఎదురుదెబ్బలు తిన్న తరువాత, ప్రతిపక్షాలకు ఇప్పుడు ఎంతో కొంత జ్ఞానోదయం అయినట్టు కనబడుతోంది. మోడీ అనే ఓ చిత్రవిచిత్ర, టక్కు టమార రాజకీయ వేషధారిని విడివిడిగా ఎన్నికల్లో ఎదుర్కోవడం తమకు సాధ్యం కాదనే విషయం దేశంలోని ప్రతిపక్షాలకు అనుభవ పూర్వకంగా తెలిసివచ్చింది.

ప్రతిపక్ష పార్టీలలో పెద్ద... చిన్న, చిల్లర పార్టీలు ఒకే గొడుగుకిందకు వచ్చే ప్రయత్నం కొంత సీరియస్‌గా చేయడం మొదలుపెట్టారు.

బీజేపీ పెద్దలు ఇది ఊహించలేదు. కొంచెం అప్రమత్తమయ్యారు.

గత నాలుగేళ్లల్లో పొరపాటున కూడా ప్రస్తావించని ఎన్.డి.ఏ అనే అక్షరాలను వెదికి పట్టుకుని, వాటికి పట్టిన దుమ్ము, బూజు దులిపి... వారు ఎక్కడెక్కడ ఉన్నారో భూతద్దం వేసి వెదికి, ఢిల్లీ పట్టుకొచ్చారు. బెంగళూరులో 26 ప్రతిపక్షాలు కలుస్తుంటే, 'మా ఎన్‌డీఏ 28 పార్టీలహో...' అంటూ టముకు వేశారు. అందులో సగం పార్టీలకు ఒక్క ఎం.పీ సీటు కూడా లేదని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. సీట్లతో పనేముంది, భావ సారూప్యత ముఖ్యంగానీ అంటూ నరేంద్ర మోడీ వాక్రుచ్చారు. మాకు గర్వం లేదు... అహంభావం లేదు... పెద్ద, చిన్న అనే భేదం కూడా లేదు పొమ్మన్నారు.

ముంబైలో ఈ ప్రతిపక్ష పార్టీలు సమావేశమవుతున్న రోజే... వంట గ్యాస్ ఖరీదుపై ఓ రెండొందలు తగ్గిస్తున్నట్టు ప్రకటించారు.

ఈ కంగారు అంతా ఎందుకు అంటే.... 'మోడీజాలం' ప్రతిపక్షాలకు అర్థమైపోయిందనే విషయం బీజేపీకి కూడా అర్థమైపోయింది.

పినరయి విజయన్ (కేరళ), స్టాలిన్ (తమిళనాడు), మమతా బెనర్జీ (బెంగాల్), లాలూ ప్రసాద్ యాదవ్ (బీహార్), అఖిలేష్ యాదవ్ (యూపీ), ఫరూక్ అబ్దుల్లా (కశ్మీర్), సోనియాగాంధీ(కాంగ్రెస్), ఉద్ధవ్ థాక్రే(ముంబై /మహారాష్ట్ర), శరద్ పవార్ వంటి రాజకీయ మల్లయోధులు చేతులు కలపడం అనేది... గతంలో అయితే ఊహకు అందని విషయం. దీనికితోడు గోడ మీద గండుపిల్లులు ఓ మూడు, నాలుగు ఉన్నాయి... ఎటు బలం కనపడితే, అటు దూకడానికి.

'మోడీ రాజకీయం' ప్రతిపక్షాలను దగ్గరకు తీసుకొచ్చింది.

రాజకీయంగా బతికుంటే... తరువాత తీరిగ్గా పోట్లాడుకోవచ్చు, ముందు ఈ మోడీ సంగతి చూద్దాం... అంటూ ఈ ప్రతిపక్షాలు ఒక చోటికి రావడంతో, బీజేపీ కలవరానికి గురైందనడంలో సందేహం లేదు. ముచ్చటగా మూడోసారి కూడా ప్రధాని పదవిని అధిష్టించాలనే మోడీ అభిలాషకు ఈ ఇం.డి.య కూటమి అడ్డు తగులుతుందా అనే ఆలోచన బీజేపీకి మొదటిసారిగా వచ్చింది.

దాని పర్యవసానమే జమిలి ఎన్నికల హడావుడి.

ఈ 'జమిలి ఎన్నికలు' అనే ఆలోచన కొత్తదేమీ కాదు. బీజేపీ పుట్టకముందే దేశంలో 1952 నుంచి మూడు నాలుగుసార్లు... రాష్ట్రాల శాసనసభలకు, పార్లమెంట్‌కు ఒకేసారి ఎన్నికలు జరుగుతూ వచ్చాయి. ఆ రోజుల్లో కాంగ్రెస్ ఒక్కటే దేశంలో ప్రధాన రాజకీయ పార్టీ.

తరువాత్తరువాత.... రాష్ట్రాల వారీగా ప్రాంతీయ పార్టీలు పుట్టుకురావడం, రాష్ట్రాలలో ఎన్నికైన ప్రభుత్వాలను కేంద్ర ప్రభుత్వ పెద్దలు రద్దుచేయడం... వగైరా కారణాలతో ఈ రెండు ఎన్నికలు విడిపోయాయి. ఏ రాష్ట్ర రాజకీయ అవసరాలను బట్టి ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతూ వస్తున్నాయి.

ఇప్పుడు, మొత్తం 29 రాష్ట్రాల శాసనసభలకు, లోకసభకు ఒకేసారి ఎన్నికలు జరపాలనేది... మోడీ ఆలోచన.

ఈ ఆలోచనను అమలు చేయడంలో గల సాధక బాధకాలను వివరించాలంటూ కేంద్రం ఒక కమిటీని వేసింది. దేశంలో ఇంక ఎవరూ అర్హులైన వారు లేరన్నట్టుగా ఈ కమిటీకి అధ్యక్షుడుగా మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌ను నియమించారు. ఒక మాజీ రాష్ట్రపతిని పార్టీ పనులకు వాడుకోవడం అనేది గతంలో ఎప్పుడూ జరగలేదు. ఆ పేరు






వినగానే, ఒళ్ళు ఒక్కసారిగా జలదరించింది... మాజీ రాష్ట్రపతికి ఏమిటీ దుస్థితి అని.

ఆ కమిటీలో హోంమంత్రి అమిత్ షా కూడా సభ్యుడు. ఇక, చెప్పేదేముంది? అదేదో తెలుగు సినిమాలో హీరోయిన్‌ను బలవంతపు పెళ్లి చేసుకోవాలనుకున్న విలన్ పురోహితుడిని పిలిచి, "పంతులూ! రేపు ఉదయం పదింటికి మంచి ముహూర్తం పెట్టవయ్యా నా పెళ్లికి' అని హుంకరించినట్టుగా జమిలి ఎన్నికలు తాము కోరుకున్న రీతిలో సిఫారసుచేసే పనిని రాంనాథ్ కోవింద్‌కు మోడీ అప్పచెప్పారు. పోనీ, మోడీ ఆలోచనలకు జైకొట్టే మాజీ ప్రధాన న్యాయమూర్తి ఒకరికి ఈ పని అప్పగించి ఉండాల్సింది.

అయినప్పటికీ, ఈ కాన్సెప్ట్‌ను ఉనికిలోకి తీసుకురావడం అంత సులభమైన విషయం కాదు. స్వాతంత్ర్యం వచ్చిన మొదటి మూడు, నాలుగుసార్లు జమిలి ఎన్నికలు సజావుగా జరిగినప్పుడు.... ఇప్పుడెందుకు జరిపించుకోలేము అనే సందేహం రావడం సహజం.

అప్పుడు కేంద్రంలోను, రాష్ట్రాలలోను కాంగ్రెస్ పార్టీదే పెత్తనం. రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యలో కూలిపోవడాలు... లేదా... వాటిని అర్ధాంతరంగా రద్దు చేయడాలు అనేవి ఉండేవి కావు.

ఇప్పుడు... ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పార్టీ అన్నట్టుగా రాజకీయం చిలవలు, పలవలుగా విస్తరించింది. రాజకీయ స్వార్థం ఊహకు అందనంతగా పెరిగి పోయింది. 'రాజకీయం' అనేది, పొలిటికల్ బిజినెస్‌గా మారిపోయింది. ఈ నేపథ్యంలో... రాష్ట్రాల శాసనసభలకు, లోక్‌సభకు ఎన్నికలు ఏక కాలంలో జరపడం సాధ్యమా అనే తర్జన భర్జనలు దేశవ్యాప్తంగా ఊపందుకున్నాయి.

దీనికోసం రాజ్యాంగ సవరణలు అవసరమవుతాయి అనే వాదన కూడా బలంగా ఉంది. రాజ్యాంగానికి ఎన్ని సవరణలు చేసుకోవాలనుకుంటే... అన్ని చేసుకోండి గానీ, దాని మౌలిక స్వరూపం మార్చే సవరణ(ల)ను మాత్రం అంగీకరించం అని సుప్రీం కోర్టు గతంలో తెగేసి చెప్పింది. మరి, ఇప్పుడు కేంద్రం తలపెట్టనున్న రాజ్యాంగ సవరణలు... రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విఘాతం కలిగించే విధంగా ఉన్నాయా అనే విషయం సుప్రీం కోర్టు పరిశీలన తరువాతే తేలుతుంది. బహుశా ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం రంగంలోకి దిగవచ్చు. ఇందులో.... ఎంతమంది పదవీ విరమణ తరువాత గవర్నర్లు, రాజ్యసభ సభ్యులు అవుతారో తెలియదు.

ఈ మొత్తం 'కసరత్తు'ను - 'జమిలి కోసం మోడీ... మోడీ కోసం జమిలి'గా అభివర్ణించవచ్చు. ఈ ప్రతిపాదన వెనుక నిర్దిష్టమైన లక్ష్యాలు ఉన్నాయి.

- మూడవసారి మోడీ ప్రధాని కావాలి.
- అది కూడా, బీజేపీకి పూర్తి మెజారిటీ రావాలి. వాజపేయి లాగా, సంకీర్ణ ప్రభుత్వాన్ని మోడీ నడపలేరు.
- ప్రతిపక్షాలు సంఘటితం అయితే, లక్ష్యానికి ప్రతిబంధకం కలగవచ్చు.
- బీజేపీకి మోడీ ఒక్కరే మగ దిక్కు. ఆయన ఒక్కరే జాతీయస్థాయి నేత. ప్రతిపక్షాలలో పాతికమంది జాతీయస్థాయిలో జనానికి తెలిసిన నేతలు ఉన్నారు.
- వారందరినీ... ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్ర ప్రచారానికి కట్టి పడేయడానికి జమిలి ఎన్నికలు ఓ మార్గం.
- జాతీయస్థాయిలో ఉమ్మడి ప్రచారానికి ప్రతి పక్షాలకు అంతగా వీలుపడదు.
- మోడీ మూడోసారి పూర్తి మెజారిటీతో ప్రధాని పదవి చేపడితే ఇండియా కాస్తా భారత్ అవుతుంది.
- 80:20గా దేశం మానసికంగా విడిపోతుంది. పాలనా పద్ధతులు సైతం 80:20కి అనుగుణంగా మారిపోవచ్చు.

అయితే, మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించినంతవరకు, రాజకీయ గమనంలో జమిలి ఎన్నికల ప్రభావం ఏమీ ఉండదు అనిపిస్తోంది. జమిలి ఎన్నికలు లేకపోయినా ఫలితాలు ఎలా ఉంటాయో... జమిలి ఎన్నికలు ఉన్నా అలాగే ఉంటాయి.

మన ఓటర్లకు 'జమిలి' అయితే ఏంటీ.... విడిగా అయితే ఏంటీ? ఏ రాయి అయితేనేం... పళ్ళూడగొట్టుకోడానికి? ఏ ఎన్నికైతేనేం.... జనాన్ని నంజుకు తినడానికి?

అందుకే, మన జనానికి అది పట్టదు.

పట్టేదల్లా... 'వివేకానందరెడ్డి మర్డర్ కేసు ఏమైంది? ఏమవుతుంది? దొరుకుతారా... దొరకరా...? దొరికేశారా? ఎట్టా? ఛా!'

ఈ తరహా ప్రశ్నల్లో ఈసారి ఎన్నికల కాలక్షేపం....

- భోగాది వేంకట రాయుడు
medhomadhanam@gmail.com

# శ్రద్ధాంజలి



జననం : 1931 నిర్యాణం : 2023

అనురాగ మూర్తి, ఆత్మీయదీప్తి

మా ఇంటి దీపం, మా పెద్దదిక్కు మా అమ్మ

## శ్రీమతి పాలిచర్ల శారదమ్మ గారు

(లేట్ జనార్ధనరెడ్డి గారి సతీమణి)

సెప్టెంబర్ 4వ తేదీ, సోమవారం ఉదయం దివంగతురాలయినారు.

ఆ అమృతమూర్తి ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు

**పాలిచర్ల వెంకటప్రసన్నరెడ్డి - స్వర్ణలత**

**పాలిచర్ల శ్రీనివాసులురెడ్డి - సుదర్శన**

మనుమలు - మనుమరాళ్ళు

**టంగుటూరు నివేదిత - టంగుటూరు రాకేష్‌రెడ్డి**

**పాలిచర్ల శరణ్ త్రిశూల్‌రెడ్డి - పాలిచర్ల పూజిత**

మునిమనుమరాళ్ళు - మునిమనుమడు

**చర్లకోల రోషిణి - చర్లకోల స్వరణ్‌రెడ్డి**

**టంగుటూరు నిచ్చిత - పాలిచర్ల అనైక**

**ఉత్తరక్రియలు:** వారి **పెద్దకర్మ సెప్టెంబర్ 16వ తేదీ,** శనివారం ఉదయం 11.00 గంటలకి, నెల్లూరుజిల్లా, కొడవలూరు మండలం, మానేగుంటపాడులోని మా స్వగృహమునందు జరుగును. బంధుమిత్రులకి తెలియచేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com